News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in :
www.cknewstv.in

# CK NEWS
చంద్రకాంత్
తెలుగు దినపత్రిక

Website
cknewstv.in

సంపుటి : 05 | సంచిక :210 | ఖమ్మం | శుక్రవారం, సెప్టెంబర్ 4, 2026 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

# కొండా సురేఖ బర్తరఫ్



## నన్ను తొలగించడం సీఎం కుట్రే

రేవంత్‌రెడ్డి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు

నన్ను తొలగించకపోతే తప్పుకుంటానన్నారు

బ్లాక్‌మెయిల్ చేసి నన్ను బర్తరఫ్ చేయించారు

కాంగ్రెస్‌పార్టీలోనే ఉంటా.. నేను పార్టీ మారను

నా కుమార్తె వ్యాఖ్యలకు నన్నెలా బాధ్యురాలిని

రాజీనామా చేయమని నన్నెవరూ అడగలేదు

బీసీ మహిళా మంత్రిగా అణచివేతకు గురయ్యా

నిర్ణయంపై రేవంత్ ఆత్మపరిశీలన చేసుకోవాలి

బర్తరఫ్ పై మీడియా సమావేశంలో సురేఖ

అధిష్టానానికి పంపిన లేఖ కొండా రిలీజ్

.. వివరాలు 2లో

మంత్రివర్గం నుంచి ఉద్వాసన

రాజీనామాకు నిరాకరించిన సురేఖ

బర్తరఫ్ నిర్ణయం తీసుకున్న రేవంత్

గవర్నర్ కు సీఎం రేవంత్ రెడ్డి లేఖ

సీఎం నిర్ణయానికి హైకమాండ్ ఓకే..

చిన్నారెడ్డి పైనా కాంగ్రెస్ పార్టీ వేటు

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఊహించిన పరిణామమే చోటుచేసుకుంది. కొండా సురేఖ రాజీనామాకు నిరాకరించడంతో, ఆమెను మంత్రివర్గం నుంచి తక్షణమే తొలగిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఆమెను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసేందుకు ప్రతిపాదించిన అధికారిక సిఫార్సు లేఖను సీఎంఓ ఇప్పటికే గౌరవ గవర్నర్‌కు పంపించింది. కొంత కాలంగా కొండా సురేఖ వ్యవహారశైలి ప్రభుత్వానికి, పార్టీకి ఇబ్బందికరంగా మారింది. సీఎం రేవంత్ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. చివరికి సీఎం కుటుంబసభ్యులను టార్గెట్ చేయడం, కొండా సురేఖ కుమార్తె సీఎంపై వ్యక్తిగత విమర్శలు చేయడంతో పరిస్థితి చేయి దాటిపోయింది. పీసీసీ క్రమశిక్షణా కమిటీ పదవుల నుంచి తప్పించాలని సిఫారసు చేయడంతో హైకమాండ్ ఈ నిర్ణయం తీసుకుంది.

## కేబినేట్‌లో బీసీ వర్గానికి ప్రాధాన్యత..

సురేఖ, చిన్నారెడ్డి స్థానంలో కొత్త వారికి చాన్స్

ప్లానింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ గా గద్వాల విజయ లక్ష్మి

రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నెరెళ్ల శారద

కుడా ఛైర్ పర్సన్ గా గుండు సుధారాణికి చాన్స్

బీసీ వర్గానికి చెందిన మహిళలకు అవకాశం

.. వివరాలు 2లో



## నల్సార్ విద్యార్థులకు సుప్రీం ఊరట




- విద్యార్థులపై చర్యలకు బీసీఐకి అధికారం లేదు
- న్యాయవాదులుగా నమోదైన వారికే అధికార పరిధి
- బీసీఐ వైఖరిని తప్పుబట్టిన సుప్రీంకోర్టు
- 2026 బ్యాచ్‌పై ఆంక్షలతో చెలరేగిన వివాదం
- సుమోటో విచారణలో కీలక స్పష్టత

2

న్యాయ విద్యార్థులపై క్రమశిక్షణ చర్యలు తీసుకునే చట్టపరమైన అధికారం భారత బార్ కౌన్సిల్‌కు లేదని సుప్రీంకోర్టు గురువారం స్పష్టం చేసింది. బీసీఐ అధికార పరిధి న్యాయవాదులుగా నమోదైన వారికే మాత్రమే పరిమితమని, విద్యార్థి దశలో ఉన్నవారిపై ఆ అధికారాన్ని ప్రయోగించలేదని పేర్కొంది. ఈ మేరకు నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయ విద్యార్థులకు భారీ ఊరటనిచ్చేలా కీలక స్పష్టత ఇచ్చింది.

# రేప్ కేసుల సెటిల్‌మెంట్ దందా








- పంజాబ్ సీఎం మాన్, ఆయన భార్యపై బీజేపీ తీవ్ర ఆరోపణలు
- ఒక్కో కేసుకు రూ.5 కోట్లు డిమాండ్ చేస్తున్నారని వ్యాఖ్య
- ఆడియో క్లిప్పులు విడుదల చేసిన ప్రదీప్ భండారీ
- ఆరోపణలను ఖండించిన గుర్‌ప్రీత్ కౌర్
- దర్యాప్తు వ్యవహారంపై హైకోర్టు ఆదేశాలు

2

పంజాబ్ సీఎం భగవంత్ మాన్, ఆయన భార్య గుర్‌ప్రీత్ కౌర్‌పై బీజేపీ తీవ్ర ఆరోపణలు చేసింది. అత్యాచారం సహా క్రిమినల్ కేసులను మధ్యవర్తుల ద్వారా డబ్బులు తీసుకుని సెటిల్ చేస్తున్నారంటూ బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ ఆరోపించారు. ఒక్కో కేసు పరిష్కారానికి రూ.5 కోట్ల వరకు డిమాండ్ చేస్తున్నారని పేర్కొన్నారు. అయితే ఈ ఆరోపణలను గుర్‌ప్రీత్ కౌర్ తీవ్రంగా ఖండించారు. గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రదీప్ భండారీ కొన్ని ఆడియో క్లిప్పులను విడుదల చేశారు. వాటిలో ఓ వ్యక్తి తనకున్న రాజకీయ పరిచయాలను ప్రస్తావిస్తూ అత్యాచారం, ఇతర క్రిమినల్ కేసులను సెటిల్ చేయడం గురించి మాట్లాడినట్లు ఉందని ఆయన పేర్కొన్నారు.



## ఏ దేశమూ ఇరాన్‌కు సాయం చేయొద్దు

- అణుశక్తిగా మారకుండా నిరోధిస్తాం
- సాయం చేసే దేశాలపై ఆంక్షలు విధిస్తాం
- ఇరాన్‌తో వాణిజ్యంపై భారత్‌కు హెచ్చరిక!
- మోదీ, ఇరాన్ అధ్యక్షుడు భేటీలో వ్యాఖ్యలు

4

ఇరాన్‌తో భారత్ వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోబోతోందన్న వార్తలను అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కొట్టిపారేశారు. అయితే, అమెరికా ఆంక్షలను తప్పించుకోవడానికి ఇరాన్‌కు ఏ దేశం సహకరించినా, ఆ దేశం కూడా తీవ్రమైన ఆంక్షలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన గట్టిగా హెచ్చరించారు.

## రామ మందిర్ సీఈవో నియామకంపై రాజకీయం

కాంగ్రెస్ అనుమానాలు.. బీజేపీ ఘాటు ప్రత్యుత్తరం



4

అయోధ్య శ్రీ రామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ తొలి సీఈఓగా భారత వైమానిక దళ మాజీ ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రా నియామకంపై దేశవ్యాప్తంగా తీవ్ర రాజకీయ వివాదం చెలరేగింది. సైనిక అధికారికి రామ మందిర ట్రస్ట్ బాధ్యతలు అప్పగించడంపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర అనుమానాలు వ్యక్తం చేయగా, బీజేపీ సైతం అంతే ఘాటుగా ఎదురుదాడికి దిగింది.

## కర్రెగుట్టల్లో మందుపాతర పేలి గిరిజనుడి మృతి

- వెదురు బొంగుల కోసం అడవికి వెళ్లి విషాదం
- మృతుడు వెదుల్లచెరువుకు చెందిన మడకం నాగేశ్వరరావు
- పాత మందుపాతరగా అనుమానిస్తున్న పోలీసులు
- అటవీ ప్రాంతంలో విస్తృతంగా కూంబింగ్

3



## మోదీని కలిసి తెలంగాణ హక్కులు అడగాలి



- కేంద్ర నిధులు, ప్రాజెక్టులపై ప్రశ్నించాలి
- బీజేపీకి మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్

3

# కొండా సురేఖ బర్తరఫ్

## మంత్రివర్గం నుంచి ఉద్వాసన
## రాజీనామాకు నిరాకరించిన సురేఖ
## బర్తరఫ్ నిర్ణయం తీసుకున్న రేవంత్
## గవర్నర్ కు సీఎం రేవంత్ రెడ్డి లేఖ
## సీఎం నిర్ణయానికి హైకమాండ్ ఓకే..
## చిన్నారెడ్డి పైనా కాంగ్రెస్ పార్టీ వేటు

**హైదరాబాద్,సెప్టెంబర్3 :** తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఊహించిన పరిణామమే చోటుచేసుకుంది. కొండా సురేఖ రాజీనామాకు నిరాకరించడంతో, ఆమెను మంత్రివర్గం నుంచి తక్షణమే తొలగిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఆమెను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసేందుకు ప్రతిపాదించిన అధికారిక సిఫార్సు లేఖను సీఎంఓ ఇప్పటికే గౌరవ గవర్నర్‌కు పంపించింది. కొంత కాలంగా కొండా సురేఖ వ్యవహారశైలి ప్రభుత్వానికి, పార్టీకి ఇబ్బందికరంగా మారింది. సీఎం రేవంత్ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. చివరికి సీఎం కుటుంబసభ్యులను టార్గెట్ చేయడం, కొండా సురేఖ కుమార్తె సీఎంపై వ్యక్తిగత విమర్శలు చేయడంతో పరిస్థితి చేయి దాటిపోయింది. పీసీసీ క్రమశిక్షణా కమిటీ పదవుల నుంచి తప్పించాలని సిఫారసు చేయడంతో హైకమాండ్ ఈ నిర్ణయం తీసుకుంది. ఇదే సమయంలో పరిపాలనాపరమైన, నామినేటెడ్ పదవుల్లో కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్‌గా ఉన్న డాక్టర్ జి. చిన్నారెడ్డి నియామకాన్ని రద్దు చేస్తూ సీఎం నిర్ణయం తీసుకున్నారు. ఆయన స్థానంలో గ్రేటర్ హైదరాబాద్ మాజీ మేయర్, కేకే కుమార్తె గద్వాల్ విజయలక్ష్మిని ప్రణాళికా సంఘం నూతన వైస్ ఛైర్‌పర్సన్‌గా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు.మహిళా సంబంధిత రంగాలు, అభివృద్ధి సంస్థలకు కూడా నూతన సారథులను ప్రకటిస్తూ ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు. తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ నూతన ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారద నియామకానికి సీఎం రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన సీనియర్ నేత శారదకు ఈ కీలక బాధ్యతలు అప్పగించడం ద్వారా ఆ వర్గానికి పెద్దపీట వేసినట్లయింది. మరోవైపు ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధికి సంబంధించి కీలకమైన కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పీఠాన్ని కూడా భర్తీ చేశారు. మాజీ రాజ్యసభ సభ్యురాలు గుండు సుధారాణిని కుడా ఛైర్‌పర్సన్‌గా నియమిస్తూ సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. కొండా సురేఖను తప్పించినందున ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయంలో సుధారాణికి ఈ ప్రాధాన్యత ఇచ్చారు. కేబినెట్ నుంచి కొండా సురేఖ తొలగింపు మరియు నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ రాష్ట్ర రాజకీయంలో సంచలనంగా మారింది. ప్రభుత్వ నిర్ణయంపై కొండా సురేఖ వర్గీయుల ప్రతిస్పందన ఎలా ఉండబోతుందనేది ఆసక్తికరంగా మారగా, రేవంత్ రెడ్డి మాత్రం తన నిర్ణయాలతో పాలనపై మరియు పార్టీపై తనకున్న పూర్తి పట్టును స్పష్టం చేశారు. రాజీనామా చేయాలని అధిష్టానం సూచించినా వెనక్కి తగ్గని కొండా సురేఖపై నేరుగా బర్తరఫ్ వేటు వేయడం, అదే సమయంలో కీలక నామినేటెడ్ పోస్టులను నింపడం ద్వారా రేవంత్ రెడ్డి ప్రభుత్వం తన రాజకీయ, పరిపాలనా ముద్రను బలంగా చాటుకుంది.



సురేఖ న్యూఢిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసి, తనపై తీసుకున్న క్రమశిక్షణా చర్యలను తీవ్రంగా ప్రశ్నించిన మరుసటి రోజే ఈ పరిణామం చోటుచేసుకుంది. క్రమశిక్షణా రాహిత్యం ఆరోపణలపై పార్టీ చర్య తీసుకోవాలనుకుంటే, ముందుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికే 'షో-కాజ్ నోటీసు' (వివరణ కోరే నోటీసు) జారీ చేయాలని ఆమె వాదించారు. ముఖ్యమంత్రి, ఇతర కాంగ్రెస్ నాయకులపై సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో, సురేఖపై చర్యలు తీసుకుంది. ఈ వ్యవహారం ఇప్పుడు ముఖ్యమంత్రికి, కొండా కుటుంబానికి మధ్య ప్రత్యక్ష ఘర్షణగా మారింది.ఇదిలా ఉండగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ఢిల్లీ పర్యటన ముగించుకుని ఈ సాయంత్రం హైదరాబాద్‌కు తిరిగి వస్తున్నారు. ఆయన శంషాబాద్ విమానాశ్రయం నుండి నల్గొండ క్రాస్ రోడ్స్‌కు చేరుకుని, అక్కడ చంచల్‌గూడ-సంతోష్ నగర్ స్టీల్ ఫ్లైఓవర్‌ను ప్రారంభిస్తారు. అనంతరం అక్కడే జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు.



# కేబినేట్‌లో బీసీ వర్గానికి ప్రాధాన్యత

## సురేఖ, చిన్నారెడ్డి స్థానంలో కొత్త వారికి చాన్స్
## ప్లానింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ గా గద్వాల విజయ లక్ష్మి
## రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా నెరెళ్ల శారద
## కుడా ఛైర్ పర్సన్ గా గుండు సుధారాణికి చాన్స్
## బీసీ వర్గానికి చెందిన మహిళలకు అవకాశం

**హైదరాబాద్, సెప్టెంబర్ 3:** రాష్ట్ర ప్రభుత్వం రెండు కీలక పదవుల్లో కూడా మార్పులు చేసింది. ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవి నుండి జి. చిన్నారెడ్డిని తొలగించి, ఆ స్థానంలో హైదరాబాద్ మాజీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని నియమించారు. అలాగే, తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ నూతన ఛైర్‌పర్సన్‌గా నెరెళ్ల శారద నియమితులయ్యారు. తెలంగాణ కాంగ్రెస్‌లో క్రమశిక్షణకు సంబంధించిన వివాదం నడుస్తున్న తరుణంలో ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యే టి. మేఘా రెడ్డిపై చేసిన వ్యాఖ్యల కారణంగా చిన్నారెడ్డి కూడా విమర్శల పాలయ్యారు. కొండా సురేఖ తన పైన చర్యల సమయంలో బీసీ కార్డు తెర మీదకు తెచ్చారు. దీంతో.. చిన్నారెడ్డి పైనా చర్యలు వెంటనే తీసుకున్నారు. ఇదే సమయంలో బీసీ వర్గానికి ప్రాధాన్యత ఇస్తూ వీరి స్థానం లో కొత్త నియామకాలు చేపట్టారు. చిన్నారెడ్డి స్థానంలో సీనియర్ నేత కేకే కుమార్తె గద్వాల విజయ లక్ష్మికి ప్లానింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ గా బాధ్యతలు అప్పగించారు. తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా నెరెళ్ల శారద ను నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. సురేఖ ను బర్తరఫ్ చేయటం తో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మాజీ రాజ్యసభ సభ్యురాలు గుండు సుధారాణిని కాకతీయ అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ (కుడా) ఛైర్ పర్సన్ గా నియమించారు. ఇక.. సురేఖ స్థానంలో కేబినెట్ లోకి బీసీ వర్గానికి చెందిన మహిళకు అవకాశం ఇవ్వనున్నారు. ఈ స్థానంలో కొత్త మంత్రి గా ఎవరికి అవకాశం దక్కుతుందనేది ఆసక్తి గా మారింది. ఇక.. ఢిల్లీ కేంద్రంగా జరిగిన చర్చల్లో వీరిద్దరి పైనా చర్యలు తీసుకోవాలని రేవంత్ పట్టు బట్టినట్లు తెలుస్తోంది. ఫలితంగా హైకమాండ్ ఆమోదంతో వేటు వేసారు.

# నల్సార్ యూనివర్సిటీ విద్యార్థులకు భారీ ఊరట

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 3:** న్యాయ విద్యార్థులపై క్రమశిక్షణా చర్యలు తీసుకునే చట్టపరమైన అధికారం భారత బార్ కౌన్సిల్ (బీసీఐ)కు లేదని సుప్రీంకోర్టు గురువారం స్పష్టం చేసింది. ఈ మేరకు నల్సార్ యూనివర్సిటీ విద్యార్థులకు భారీ ఊరటనిస్తూ కీలక తీర్పు వెలువరించింది. బీసీఐ అధికార పరిధి కేవలం న్యాయవాదులుగా నమోదైన వారికి మాత్రమే పరిమితమని, విద్యార్థి దశలో ఉన్నవారికి ఇది వర్తించదని ధర్మాసనం తేల్చి చెప్పింది. నల్సార్ యూనివర్సిటీ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌ను ఆహ్వానించడాన్ని వ్యతిరేకిస్తూ కొందరు విద్యార్థులు లేఖ రాశారు. ఈ వ్యవహారంపై తీవ్రంగా స్పందించిన బీసీఐ ఛైర్మన్ మనన్ కుమార్ మిశ్రా, మూడు రోజుల్లోగా నివేదిక సమర్పించాలని నల్సార్ వైస్-ఛాన్సలర్‌ను ఆదేశించారు. అంతటితో ఆగకుండా, నల్సార్ 2026 బ్యాచ్‌కు చెందిన ఏ విద్యార్థినీ న్యాయవాదిగా నమోదు చేసుకోవద్దని దేశంలోని అన్ని రాష్ట్రాల బార్ కౌన్సిళ్లకు సర్క్యులర్ జారీ చేశారు. ఈ నిర్ణయంపై సర్వత్రా విమర్శలు రావడంతో మనన్ కుమార్ మిశ్రా ఆ ఉత్తర్వులను ఉపసంహరించుకున్నారు. అయినప్పటికీ, ఈ అంశాన్ని సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించి విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా బీసీఐ వైఖరిని తీవ్రంగా తప్పుబట్టిన ధర్మాసనం, విద్యార్థులపై చర్యలు తీసుకునే అధికారం బీసీఐకి లేదని స్పష్టం చేసింది. ఈ తీర్పుతో నల్సార్ విద్యార్థులకు పెద్ద ఉపశమనం లభించింది.

# నన్ను తొలగించడం సీఎం కుట్రే

## బర్తరఫ్ పై మీడియా సమావేశంలో సురేఖ
## అధిష్టానానికి పంపిన లేఖ కొండా రిలీజ్

**హైదరాబాద్, సెప్టెంబర్ 3:** మంత్రి పదవి నుంచి తనను తొలగించడం వెనుక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుట్ర ఉందని కొండా సురేఖ సంచలన ఆరోపణలు చేశారు. తనను మంత్రివర్గం నుంచి తొలగించకపోతే తానే తప్పుకొంటాననంటూ రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ అధిష్టానంపై ఒత్తిడి తెచ్చారని ఆరోపించారు. "నన్ను బర్తరఫ్ చేస్తారా?.. నన్నే వెళ్లిపొమ్మంటారా?" అంటూ అధిష్టానాన్ని బ్లాక్‌మెయిల్ చేసి తనను తొలగించేలా చేశారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అయితే తాను కాంగ్రెస్‌ను వీడే ఆలోచనలో లేనని, పార్టీపై తన విశ్వాసం కొనసాగుతుందని స్పష్టం చేశారు. తన తొలగింపుపై గురువారం మీడియాతో మాట్లాడిన సురేఖ.. కనీసం తన వివరణ కూడా తీసుకోకుండా నిర్ణయం తీసుకోవడం బాధాకరమన్నారు. రాజీనామా చేయాలని తనను ఎవరూ అడగలేదని, అధిష్టానం నుంచి ముందస్తుగా ఎలాంటి సమాచారం రాలేదని చెప్పారు. తనతో మాట్లాడి వివరణ తీసుకున్న తర్వాత నిర్ణయం తీసుకుని ఉంటే బాగుండేదన్నారు. "ఉరిశిక్ష పడిన ఖైదీని కూడా చివరి కోరిక అడుగుతారు. కానీ నా విషయంలో కనీసం వివరణ కూడా అడగలేదు. పదవి పోయిందనే బాధ నాకు లేదు. కారణం చెప్పకుండా అవమానకరంగా తొలగించడమే బాధిస్తోంది" అని సురేఖ వ్యాఖ్యానించారు. తన కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయడాన్ని సురేఖ తప్పుబట్టారు. సుస్మితకు స్వతంత్ర వ్యక్తిత్వం ఉందని, ఆమె వ్యక్తిగత అభిప్రాయాలను తాను ఖండించాల్సిన అవసరం లేదన్నారు. ఆమెతో తాము ఆ వ్యాఖ్యలు చేయించలేదని స్పష్టం చేశారు. సుస్మిత వ్యాఖ్యలను పొంగులేటి సుధాకర్‌రెడ్డి రాజకీయంగా ఉపయోగించుకున్నారని ఆరోపించారు. ఇతర కాంగ్రెస్ నేతలు చేసిన వివాదాస్పద వ్యాఖ్యల విషయంలో ఎలాంటి చర్యలు తీసుకున్నారో చెప్పాలని ప్రశ్నించారు. జగ్గారెడ్డి, రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలపై అధిష్టానం ఏ నిర్ణయం తీసుకుందని నిలదీశారు. తన విషయంలోనే ఎందుకు ఇంత తీవ్రంగా స్పందించారో ముఖ్యమంత్రి ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి తర్వాత తాను ఎక్కువగా అభిమానించిన నాయకుడు రేవంత్‌రెడ్డేనని సురేఖ చెప్పారు. ఆయన పీసీసీ అధ్యక్షుడు కావాలని, ముఖ్యమంత్రి కావాలని కోరుకున్న వారిలో తాను ముందున్నానన్నారు. అయినప్పటికీ తనపై కక్షపూరితంగా వ్యవహరించారని ఆరోపించారు. తనపై వేం నరేందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, కొండల్‌రెడ్డి, పొంగులేటి సుధాకర్‌రెడ్డి తదితరులు కుట్ర చేశారని ఆరోపించారు. తనతో పాటు తన మాజీ ఓఎస్‌డీ సుమంత్ కుటుంబాన్ని కూడా కావాలనే వేధించారని విమర్శించారు. సుమంత్‌పై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మంత్రిగా ఉన్నప్పటికీ తనకు పూర్తి అధికారాలు లేకుండా చేశారని సురేఖ ఆరోపించారు. తన శాఖలకు సంబంధించిన కీలక నిర్ణయాలు తన ప్రమేయం లేకుండానే జరిగాయని చెప్పారు. తనకు తెలియకుండానే మాజీ ఓఎస్‌డీ సుమంత్‌ను తొలగించారని పేర్కొన్నారు. తన శాఖకు సంబంధించిన వ్యవహారాల్లో ఎమ్మెల్యే కడియం శ్రీహరి జోక్యం చేసుకున్నారని, దేవాదాయ శాఖ అధికారులతో ఆయన సమీక్షలు నిర్వహించినా తనకు సమాచారం ఇవ్వలేదని ఆరోపించారు. వరంగల్ తూర్పు నియోజకవర్గ అభివృద్ధి విషయంలోనూ వివక్ష చూపారని విమర్శించారు. "మంత్రులందరూ సంతోషంగా ఉన్నారా? గుండెలపై చేయి వేసుకుని చెప్పాలి. ఎమ్మెల్యేలు, మంత్రుల్లో అసంతృప్తి ఉందన్న విషయం అందరికీ తెలుసు. పనులు జరగాలంటే ఎవరి దగ్గరకు వెళ్లాలో తెలియని పరిస్థితి ఉంది" అని సురేఖ వ్యాఖ్యానించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు కాకపోవడంతో ప్రజల్లో వ్యతిరేకత ఉందని కూడా ఆమె పేర్కొన్నారు. తనపై చర్యలకు ముందే కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకు రాసిన వివరణాత్మక లేఖను సురేఖ మీడియాకు విడుదల చేశారు. ఆగస్టు 23న రాసినట్లు పేర్కొన్న ఆ లేఖలో బీసీ మహిళా మంత్రిగా తాను రాజకీయ అణచివేతకు గురవుతున్నట్లు వివరించారు. 31 ఏళ్ల రాజకీయ ప్రస్థానం, ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన అనుభవాన్ని ప్రస్తావిస్తూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తన అధికారాలను క్రమంగా కుదించారని లేఖలో ఆరోపించారు. తన శాఖలకు సంబంధించిన కీలక నిర్ణయాలు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచే నేరుగా వెలువడుతున్నాయని పేర్కొన్నారు. యాదాద్రి ఆలయ ట్రస్ట్ బోర్డు ఏర్పాటు విషయంలో తనను సంప్రదించలేదని, సమ్మక్క--సారలమ్మ ఆలయ అభివృద్ధి నిధులను రోడ్లు, భవనాల శాఖకు బదిలీ చేశారని పేర్కొన్నారు. శ్రీరామనవమి సందర్భంగా ప్రభుత్వ ప్రకటనల్లో తన ఫొటోను తొలగించడం తన గౌరవాన్ని దెబ్బతీసిందని ఆవేదన వ్యక్తం చేశారు.



వరంగల్ తూర్పులో స్మార్ట్ సిటీ, మోడల్ బస్‌స్టాండ్, బొందివాగు విస్తరణ తదితర అభివృద్ధి పనులకు నిధులు ఆలస్యమవుతున్నాయని కూడా లేఖలో ప్రస్తావించారు. తన ఆరోపణలకు సంబంధించిన వీడియోలు, ఇతర ఆధారాలతో కూడిన పెన్‌డ్రైవ్‌ను సైతం అధిష్టానానికి అందించినట్లు తెలిపారు. తన తదుపరి కార్యాచరణపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని సురేఖ స్పష్టం చేశారు. ప్రస్తుతం పార్టీ మారే ఆలోచన లేదని, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీలపై తమకు అభిమానం ఉందన్నారు. కాంగ్రెస్‌పై తన విశ్వాసం చెక్కుచెదరలేదని చెప్పారు. అయితే సురేఖ ఎమ్మెల్యే పదవికి, పార్టీకి రాజీనామా చేయవచ్చంటూ రాజకీయ వర్గాల్లో ఊహాగానాలు సాగుతున్నాయి. బీజేపీ నుంచి ఆహ్వానం అందిందని, బీఆర్ఎస్ వైపు వెళ్లవచ్చని కూడా ప్రచారం జరుగుతున్నప్పటికీ.. వీటిపై సురేఖ ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. అందువల్ల ఆమె భవిష్యత్ రాజకీయ ప్రయాణంపై వస్తున్న ప్రచారాన్ని ప్రస్తుతానికి ఊహాగానంగానే చూడాల్సి ఉంది. ఇదిలా ఉండగా ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ సురేఖను తమ పార్టీలోకి రావాలని బహిరంగంగా ఆహ్వానించారు. "మీ కోసం ప్రజాశాంతి పార్టీ ఉంది.. వేరే పార్టీలోకి వెళ్లకండి" అని వీడియో సందేశంలో కోరారు. కాంగ్రెస్‌లో బీసీ నాయకులకు అన్యాయం జరుగుతోందని ఆయన ఆరోపించారు. బీసీలు, బడుగు బలహీన వర్గాలు ఏకం కావాలని పిలుపునిచ్చారు. మొత్తంగా మంత్రి పదవి నుంచి తన తొలగింపునకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డే కారణమంటూ కొండా సురేఖ నేరుగా ఆరోపించడం.. అదే సమయంలో కాంగ్రెస్‌లోనే కొనసాగుతానని ప్రకటించడం రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు తెరతీసింది. ఇప్పుడు ఆమె తదుపరి రాజకీయ అడుగు ఏమిటన్నదే ఉత్కంఠగా మారింది.

# రేప్ కేసుల సెటిల్‌మెంట్ దందా

## పంజాబ్ సీఎం మాన్, ఆయన భార్యపై బీజేపీ తీవ్ర ఆరోపణలు
### ఒక్కో కేసుకు రూ.5 కోట్లు డిమాండ్ చేస్తున్నారని వ్యాఖ్య
### ఆడియో క్లిప్పులు విడుదల చేసిన ప్రదీప్ భండారీ
### ఆరోపణలను ఖండించిన గుర్‌ప్రీత్ కౌర్
### దర్యాప్తు వ్యవహారంపై హైకోర్టు ఆదేశాలు




**చండీగఢ్:** పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, ఆయన భార్య గుర్‌ప్రీత్ కౌర్‌పై బీజేపీ తీవ్ర ఆరోపణలు చేసింది. అత్యాచారం సహా క్రిమినల్ కేసులను మధ్యవర్తుల ద్వారా డబ్బులు తీసుకుని సెటిల్ చేస్తున్నారంటూ బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ ఆరోపించారు. ఒక్కో కేసు పరిష్కారానికి రూ.5 కోట్ల వరకు డిమాండ్ చేస్తున్నారని పేర్కొన్నారు. అయితే ఈ ఆరోపణలను గుర్‌ప్రీత్ కౌర్ తీవ్రంగా ఖండించారు. గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రదీప్ భండారీ కొన్ని ఆడియో క్లిప్పులను విడుదల చేశారు. వాటిలో ఓ వ్యక్తి తనకున్న రాజకీయ పరిచయాలను ప్రస్తావిస్తూ అత్యాచారం, ఇతర క్రిమినల్ కేసులను సెటిల్ చేయడం గురించి మాట్లాడినట్లు ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ ఆడియోల ప్రామాణికత, వాటిలోని సంభాషణలకు ముఖ్యమంత్రి లేదా ఆయన కుటుంబంతో ప్రత్యక్ష సంబంధం ఉందా అన్న అంశాలు అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది.

### 'రూ.5 కోట్లకు సెటిల్ చేస్తున్నారా?'

మధ్యవర్తుల ద్వారా కేసులను రూ.5 కోట్లకు సెటిల్ చేస్తున్నారని భండారీ ఆరోపించారు. సీఎం వ్యక్తిగతంగా కేసుల విషయంలో జోక్యం చేసుకుంటున్నారా? ముఖ్యమంత్రి నివాసం కేంద్రంగా ఏమైనా ఒప్పందాలు జరుగుతున్నాయా? అంటూ ప్రశ్నించారు. ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌పైనా ఆయన ఆరోపణలు చేశారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి బీజేపీ నేత చేసిన వ్యాఖ్యలకు స్వతంత్ర నిర్ధారణ లేదు.

### ఏమిటీ కేసు?

సామాజిక మాధ్యమ ప్రభావశీలి గుర్విందర్ సింగ్ చాహల్‌కు సంబంధించిన అత్యాచారం కేసు నేపథ్యంలో తాజా రాజకీయ ఆరోపణలు తెరపైకి వచ్చాయి. ఓ మహిళను అపహరించి అత్యాచారం చేశారన్న ఆరోపణలపై చాహల్‌పై కేసు నమోదైంది. ఏప్రిల్ 29న అమృత్‌సర్‌లో కేసు నమోదు కాగా, మే 1న బాధితురాలిని పోలీసులు గుర్తించినట్లు సమాచారం. అనంతరం అత్యాచారం ఆరోపణలను కేసులో చేర్చారు. మే 13న చాహల్‌ను అరెస్టు చేయగా.. తర్వాత ఆయన విడుదల కావడంతో దర్యాప్తు తీరుపై రాజకీయ విమర్శలు మొదలయ్యాయి. బాధితురాలి తండ్రి పంజాబ్-హర్యానా హైకోర్టును ఆశ్రయించి దర్యాప్తుపై అనుమానాలు వ్యక్తం చేశారు. దీంతో జూలై 20న గత దర్యాప్తుతో సంబంధం లేకుండా సీనియర్ పోలీసు అధికారితో విచారణ చేపట్టాలని న్యాయస్థానం ఆదేశించినట్లు సమాచారం.

### మానవ హక్కుల కమిషన్ దృష్టికి

కేసును సెటిల్ చేసేందుకు రూ.5 కోట్లు డిమాండ్ చేశారన్న ఆరోపణలు ఆగస్టులో జాతీయ మానవ హక్కుల కమిషన్ దృష్టికి వెళ్లాయి.



దీనిపై విచారణ జరిపి తీసుకున్న చర్యల నివేదిక సమర్పించాలని పంజాబ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీని కమిషన్ ఆదేశించినట్లు సమాచారం. మరోవైపు తనపై వస్తున్న ఆరోపణలను సీఎం భగవంత్ మాన్ భార్య గుర్‌ప్రీత్ కౌర్ ఖండించారు. ముఖ్యమంత్రిని లక్ష్యంగా చేసుకునేందుకే తనపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో మధ్యవర్తిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న సిమ్రంజిత్ సింగ్ హుండాల్ కూడా తాను గుర్‌ప్రీత్ కౌర్‌ను ఎప్పుడూ కలవలేదని స్పష్టం చేశారు. బీజేపీ చేస్తున్న తీవ్ర ఆరోపణలు, మరోవైపు వాటిని సీఎం కుటుంబం ఖండిస్తున్న నేపథ్యంలో.. ఆడియో క్లిప్పుల ప్రామాణికతతో పాటు రూ.5 కోట్ల 'సెటిల్‌మెంట్' ఆరోపణల్లో వాస్తవాలేమిటన్నది అధికారిక దర్యాప్తులో తేలాల్సి ఉంది.

## కాంగ్రెస్ 1000 రోజుల పాలన.. ఏన్కూరులో జోష్

- కేక్ కట్ చేసి సంబరాలు.. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఇందిరమ్మ రాజ్యం



**సీకే న్యూస్ ఖమ్మం జిల్లా ప్రతినిధి ఇస్లావత్ నరసింహ ఏన్కూరు సెప్టెంబర్ 03 2026:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయిన సందర్భంగా ఏన్కూరు మండల కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా సంబరాలు నిర్వహించారు. మండల కేంద్రంలో నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై నినాదాలు చేస్తూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. 1000 రోజుల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల కోసం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందన్నారు. పేదలు, రైతులు, మహిళలు, యువత సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.

పేదవాడి ముఖంలో చిరునవ్వే ఇందిరమ్మ రాజ్యానికి అసలైన అర్థమని నాయకులు అన్నారు. పేద కుటుంబాలకు అండగా నిలవడం, ప్రతి నిరుపేదకు సొంతింటి కలను సాకారం చేయడం, రైతులకు భరోసా కల్పించడం, మహిళలకు ఆర్థికంగా చేయూతనివ్వడం వంటి లక్ష్యాలతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.

గతంలో ఇచ్చిన హామీలను కేవలం మాటలకే పరిమితం చేయకుండా.. ఒక్కొక్క హామీని అమలు చేస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమేనని నాయకులు పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధితో పాటు సామాజిక న్యాయానికి ప్రాధాన్యతనిస్తూ అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

ఇందిరమ్మ రాజ్యం అంటే పేదల రాజ్యం.. రైతుల రాజ్యం.. మహిళల రాజ్యం.. యువత భవిష్యత్తుకు భరోసా ఇచ్చే రాజ్యమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజలకు చేరువగా పాలన కొనసాగిస్తామని తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా మండల కాంగ్రెస్ శ్రేణులు కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించగా, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గట్టు మండల కాంగ్రెస్ అధ్యక్ష పదవికి నామినేషన్ వేసిన ఆరగిద్ద సర్పంచ్ ఏ. బాలకృష్ణ....



**గట్టు మండలం సెప్టెంబర్ 3:**జోగులాంబ గద్వాల జిల్లా, గట్టు మండలం ఆరగిద్ద గ్రామ సర్పంచ్ ఎ. బాలకృష్ణ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంగఠన్ సృజన్ అభియాన్ (రూూరా) లో భాగంగా గట్టు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవికి ఆరగిద్ద గ్రామ సర్పంచ్ ఏ. బాలకృష్ణ నామినేషన్ దాఖలు చేశారు.

2008 నుండి కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్న ఆయన, ఆరగిద్ద గ్రామ సర్పంచ్ గా అభివృద్ధి కార్యక్రమాలు చేస్తూ ప్రజల్లో మంచి గుర్తింపు పొందారు. భవిష్య పలు సేవా కార్యక్రమాలతో ముందున్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధిష్టానం తనకు అవకాశం ఇస్తే గట్టు మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తానని తెలిపారు.

## ఎస్సి బాలుర వసతి గృహాన్ని ప్రారంభించిన గౌరవ బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

- విద్యార్థులకు చేరువలోనే హాస్టల్ ఏర్పాటు
- ప్రభుత్వ పాఠశాల విద్యనే బలంగా ఉంటుంది
- నేను ప్రభుత్వ పాఠశాలలో చదివే ఎమ్మెల్యే అయ్యా
- ప్రభుత్వ పాఠశాలలన్నీ ఇంటిగ్రేటెడ్ పాఠశాలలుగా మారుస్తాం



**సికె. న్యూస్ బజార్హత్నూర్** బజార్ హత్నూర్ మండల కేంద్రంలో గల ఎస్సి బాలుర వసతి గృహాన్ని ప్రవేటు భవనం నుండి మండల కేంద్రంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల (గ్రానూ) లో ఏర్పాటు చేసిన సందర్భంగా ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా గౌరవ బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా హాజరయి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ.. విద్యార్థులకు చేరువలోనే హాస్టల్ ఉండాలన్న ఉద్యేష్యంతో ప్రభుత్వ భవనం గల్గానూ పాఠశాలకు మార్చడం జరిగిందన్నారు. విద్యార్థులు చదువులో రాణించి తల్లిదండ్రులతో పాటు పాఠశాలకు సైతం పేరు తీసుకురావాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల శాతం పెంచాలన్నారు. గ్రామస్తులు అందరూ బాధ్యతగా ఉంటేనే అభివృద్ధి జరుగుతుందన్నారు కార్యక్రమంలో మండల అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# కాంగ్రెస్ సర్కారు 1,000 రోజుల విజయోత్సవం



**సి కే న్యూస్, రాయపర్తి :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం 1,000 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా రాయపర్తి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా విజయోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి ఆదేశాల మేరకు మండల పార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ చేపట్టారు. రాయపర్తి మండలంలోని మైలారం, వెంకటేశ్వరపల్లి, సన్నూరు, ఊకల్, గట్టికల్, పేరుకేడ్, రామన్నగూడెం తదితర గ్రామాల మీదుగా బైక్ ర్యాలీ కొనసాగి రాయపర్తి మండల కేంద్రానికి చేరుకుంది. అనంతరం కాంగ్రెస్ శ్రేణులు విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. బాణసంచా కాల్చి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పాలన సాగిస్తూ 1,000 రోజులు విజయవంతంగా పూర్తి చేసుకోవడం గర్వకారణమన్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పార్టీ శ్రేణులు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ యీకార్యక్రమంలో మండల ముఖ్య నాయకులు, సర్పంచులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, సోషల్ మీడియా ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## వ్యవసాయ రంగ ఆధునీకరణతోనే రైతన్నకు మరింత మేలు



**జిల్లా స్థాయి కిసాన్ మేళాలో ఎంపీ గోడం నగేష్**

**సికె.న్యూస్. ప్రతినిధి ప్రతినిధి ఆదిలాబాద్:** వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించడం, రైతులకు ఆధునిక సాగు పద్ధతులు, నూతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించడం ద్వారా వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చేందుకు సమష్టి కృషి అవసరమని ఎంపీ గోడం నగేష్ అన్నారు.

మావల మండల కేంద్రంలోని చిలుకూరి లక్ష్మీ గార్డెన్‌లో గురువారం ఆత్మ (రూహీూ) ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి కిసాన్ మేళాను జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎం పి మాట్లాడుతూ, దేశ జనాభాలో సుమారు 80 శాతం మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్నప్పటికీ, జీడీపీలో వ్యవసాయ రంగం వాటా తక్కువగా ఉందని అన్నారు. రైతుల ఆదాయం పెంచేందుకు సంప్రదాయ సాగు విధానాలతో పాటు ఆధునిక సాంకేతికత, శాస్త్రవేత్తల సూచనలు, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పంటల వైవిధ్యీకరణపై దృష్టి సారించాలన్నారు. ప్రాంతీయ వాతావరణ పరిస్థితులు, భూసారం, నీటి లభ్యతకు అనుగుణంగా ఆయిల్‌పామ్‌తో పాటు ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని సూచించారు. వ్యవసాయ ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ పెంచేందుకు ఎగుమతి అవకాశాలను విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు.

జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ, రైతులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు ఒకే వేదికపై సమావేశమై ప్రభుత్వ పథకాలు, ఆధునిక సాగు విధానాలు, నూతన సాంకేతికతపై అవగాహన పొందేలా కిసాన్ మేళా నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాలో సేంద్రీయ వ్యవసాయం, ఆయిల్‌పామ్ సాగు, డ్రోన్ సాంకేతికత వినియోగాన్ని విస్తృతంగా ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. నిరుద్యోగ గిరిజన యువతకు డ్రోన్ ఆపరేషన్‌పై శిక్షణ అందించి, బ్యాంకు రుణాల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.

అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ ద్వారా తక్కువ వడ్డీతో డ్రోన్లు, ద్విచక్ర వాహనాలు తదితర వ్యవసాయ అవసరాల కోసం రుణ సదుపాయాలు పొందవచ్చని రైతులకు వివరించారు. యాసంగిలో నీటి వినియోగం తక్కువగా ఉండే పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ధాన్యం నిల్వకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో భాగంగా కొత్త గోదాముల నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు తెలిపారు.

రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులపై ఎలాంటి ప్రీమియం భారం లేకుండా ఉచిత పంటల బీమా అమలు చేయాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ కోరారు. రైతుల పొలాలకు రహదారి సౌకర్యం కల్పించడంతో పాటు ప్రతి గ్రామంలో గోదాముల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఎన్ఆర్ఈజీఎస్ నిధుల్లో 50 శాతం వ్యవసాయ రంగానికి కేటాయించాలని కోరారు. అప్పుల భారంతో రైతులు ఆత్మహత్యలకు పాల్పడవద్దని, రైతులకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ, రైతులు దళారులపై ఆధారపడకుండా మార్కెట్ యార్డులు, మార్కెట్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష మాట్లాడుతూ, రైతు భరోసా, రైతు బీమా తదితర ప్రభుత్వ పథకాలు రైతు కుటుంబాలకు అండగా నిలుస్తున్నాయని తెలిపారు. శాస్త్రీయ సాగు పద్ధతులను అవలంబించి అధిక దిగుబడులు, మెరుగైన ఆదాయం సాధించాలని రైతులకు సూచించారు.

అనంతరం ముఖ్య అతిథులు కిసాన్ మేళాలో ఏర్పాటు చేసిన వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక శాఖలకు చెందిన స్టాళ్లతో పాటు ఆధునిక వ్యవసాయ యంత్ర పరికరాల ప్రదర్శనను సందర్శించారు. నూతన సాంకేతిక పరిజ్ఞానం, ఆధునిక యంత్రాల వినియోగం, రైతులకు అందుబాటులో ఉన్న వివిధ సేవలపై నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.

ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ బోథ్, ఇచ్చోడ ఆత్మ చైర్మన్లు సంతోష్ రావు, రాజు, నారాయణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రవీందర్ సింగ్, పశుసంవర్ధక శాఖ అధికారి రామారావు, ఉద్యాన శాఖ అధికారి సందీప్ కుమార్, ఆర్డీఓ రాథోడ్ రవీందర్, వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్య, వసతుల కల్పనే ప్రభుత్వ ధ్యేయం:జిల్లా కలెక్టర్ రాజర్షిషా



**సికె. న్యూస్ ప్రతినిధి.ఆదిలాబాదు:** విద్యార్థులు క్రమశిక్షణతో చదివి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం బజార్హత్నూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ బాలుర వసతి గృహాన్ని స్థానిక శాసన సభ్యులు అనిల్ జాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, అధికారులు అతిథులకు శాలువాతో సత్కరించి ఘన స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బజార్‌హత్నూర్‌లో ఎస్సీ, బీసీ హాస్టళ్ల నూతన భవనాల నిర్మాణానికి త్వరలోనే పరిపాలనాపరమైన అనుమతులు రానున్నాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించే లక్ష్యంతో త్వరలోనే బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రారంభిస్తామని, కొల్హారిలో హరిరామ్, హరికృష్ణ అందజేసిన గోడౌన్‌ను ఇందుకు సద్వినియోగం చేసుకుంటున్నట్లు వెల్లడించారు. అలాగే ఆరోగ్య పాఠశాల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు చక్కటి వ్యక్తిగత వికాసం, మంచి అలవాట్లు అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో సమాచార మార్పిడి నైపుణ్యాలను పెంపొందించేందుకు స్పోకెన్ ఇంగ్లీష్ తరగట్లతో పాటు, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్, ఖాన్ అకాడమీ ద్వారా డిజిటల్ విద్యనభ్యసించాలని సూచించారు. అలాగే కొత్త యూనిఫాంలు, షూలు అందించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు రోజూ క్రమం తప్పకుండా పాఠశాలలకు వచ్చి సబ్జెక్టులను క్షుణ్ణంగా అభ్యసించాలని, ప్రాథమిక స్థాయి నుంచే కమ్యూనికేషన్ నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటే భవిష్యత్తులో ఉన్నత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని తెలిపారు. పదవ తరగతి విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బాసర ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించేలా ఇప్పటి నుంచే లక్ష్యంతో కష్టపడి చదవాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ.. విద్యార్థులు బాగా చదువుకుంటే తల్లిదండ్రుల పేరుతో పాటు ఉపాధ్యాయులు, పాఠశాల పేరును కూడా నిలబెట్టవచ్చున్నారు. తాను సైతం ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకొని నేడు ఎమ్మెల్యే స్థాయికి వచ్చానని గుర్తుచేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో సర్టిఫైడ్ ఉపాధ్యాయులు, అత్యుత్తమ బోధన అందుతుందని, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యార్థులు ప్రభుత్వ బడుల్లోనే చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ చొరవతో జిల్లాకు మంచి గుర్తింపు వస్తుందని వెల్లడించారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నర్సయ్య మాట్లాడుతూ, ప్రవైట్ కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలను తీర్చిదిద్దడం జరుగుతుందని అన్నారు. పాఠశాలల అభివృద్ధికి అందరూ సహకరించాలని అన్నారు. తల్లితండ్రులు విద్యార్థుల పట్ల శ్రద్ధ వహించాలన్నారు. బజార్హత్నూర్ మండలంలో పెండింగ్లో అభివృద్ధి పనులను పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులు గ్రంథాలయాల్లో పుస్తక పఠనం అలవాటుగా మార్చుకోవాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి సునీతకుమారి, ఏంఆర్ఓ శ్యాంసుందర్, ఎంపిడిఓ మహేందర్, సర్పంచ్ సాయన్న, ఏంఈఓ రాంకిషన్, ఏఏపిసి చైర్మన్ నవనీత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు భూమన్న, వార్డెన్ చైతన్య, ఇతర అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ధర్మసాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల స్కూల్ బ్యాగుల పంపిణీ కార్యక్రమం .చైర్మన్ గంగారపు అజయ్



**సీకే న్యూస్ సెప్టెంబర్ 3 గురువారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ప్రతినిధి కమలాకర్**

స్థానిక ధర్మసాగర్ జిల్లా పరిషత్ పాఠశాలలో జి ఏ ఎస్ ఎఫ్ సంస్థ వ్యవస్థాపకులు చైర్మన్ గంగారపు అజయ్ ఆధ్వర్యంలో స్కూల్ పిల్లల బ్యాగుల పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ధర్మసాగర్ గ్రామ సర్పంచ్ మాచర్ల జ్యోతి ఏలియా హాజరైనారు. జిల్లా పరిషత్ పాఠశాల ప్రధాన చార్యులు అజ్మీర గణేష్ దాతలను ఉద్దేశించి మాట్లాడుతూ, గంగారపు ఆదాం శాంతమ్మ స్వచ్ఛంద సంస్థ గురించి మాట్లాడుతూ తండ్రి మరణాన్ని గుర్తుచేసుకొని నిరుపేదలైన విద్యార్థులకు బ్యాగుల పంపిణీ చేయడం ఎంతో ఆనందదాయకం, ఇప్పటి పరిస్థితుల్లో ఇటువంటి కార్యక్రమం చేయడం ఎంతో గర్వ కారణం. చదువుకుంటున్న నిరుపేద విద్యార్థులకే కాదు అనాథాశ్రమంలో ఉన్నవారికి అన్నదానం, వృద్ధులకు చీరల పంపిణీ, రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి తండ్రికి తగ్గ తనయుడిగా ఈ సేవ చేయడం ఎంతో సంతోషం అన్నారు. తదనంతరం గంగారపు అమృత రావు తన తండ్రి ధర్మసాగర్ గ్రామానికి చేసిన సేవ ఇల్లు లేని వారికి కాంగ్రెస్ ప్రభుత్వం నుండి స్నేహ కాలనీ, వడ్డెర కాలనీ, బీసీ కాలనీ చెరువు వద్ద నున్న బీసీ, ఎస్సీ కాలనీ ఏర్పరచి ప్రజల మన్ననులు పొందినారు. తన జ్ఞాపకార్థంగా తన కుమారులుగా మేము మా కుటుంబ సభ్యులు అందరం కలిసి పాలుపంచుకొని ఎంతో శుభ పరిణామం అన్నారు. జిఏ,ఎస్,ఎఫ్ చైర్మన్ గంగారపు అజయ్ మాట్లాడుతూ మా నాన్నగారి అడుగుజాడల్లో నడిచి గంగారపు ఆదాము పేరు మీద ఈ కార్యక్రమం ఈ పాఠశాలలో విద్యార్థులకు బ్యాగుల పంపిణీ చేయడం మాకు ఎంతో ఆనందకరం అన్నారు. ధర్మసాగర్ గ్రామపంచాయతీ సర్పంచ్ మాచర్ల జ్యోతి ఏలియా మాట్లాడుతూ, స్వర్గస్తులైన గంగారపు ఆదాం నాకు పెదనాన్న అవుతారు, వ్యవసాయ భూములు వారివి, మావి ఒకే దగ్గర ఉండేవి, అతని వ్యక్తిత్వం చూసినాను, అతడు మంచి మృదు స్వభావి, అతనిలో ప్రేమ, దయ జాలి ,కరుణ అనే గుణాలు ఉండేవి ,అతడు మన మధ్యలో లేకపోయినా ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని ప్రార్థిస్తున్నాం అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, కుటుంబ సభ్యులు, మనుమలు, మనుమరాలు, కోడలు పాల్గొన్నారు.ం

# అతివలకు అండగా ఆదిలాబాద్ షీ టీం..

- ఆగస్టు నెలలో 136 ఫిర్యాదులకు స్పందన -- 5 ఎఫ్ఐఆర్లు, 117 ఈ-పెట్టి కేసులు
- 163 హాట్‌స్పాట్లలో ఆకస్మిక తనిఖీలు -- 14 మందికి కౌన్సెలింగ్
- 2 బాల్యవివాహాలను అడ్డుకున్న షీ టీం
- జిల్లా వ్యాప్తంగా 48 అవగాహన కార్యక్రమాలు
- ఉత్తమ ప్రతిభ కనబరిచిన షీ టీం సిబ్బందికి ప్రశంస పత్రాలు, నగదు రివార్డులు
- మహిళలు, విద్యార్థినుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి
- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్



సికె. న్యూస్ ప్రతినిధి.ఆదిలాబాద్ :ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా మహిళలు, విద్యార్థినుల భద్రతకు షీ టీం బృందాలు నిరంతరం పనిచేస్తున్నాయని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ తెలిపారు. ఆగస్టు నెలకు సంబంధించిన షీ టీం నెలవారీ నివేదికను విడుదల చేసిన అనంతరం గురువారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీస్ అక్క, షీ టీం సభ్యులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.
ఆగస్టు నెలలో జిల్లా వ్యాప్తంగా షీ టీం బృందాలకు 136 ఫిర్యాదులు అందగా, వాటిపై తక్షణమే స్పందించి బాధితులకు అవసరమైన సహాయ సహకారాలు అందించారు. 117 ఈ-పెట్టి కేసులు, 5 ఎఫ్ఐఆర్ కేసులు నమోదు చేయడంతో పాటు 14 మందికి కౌన్సెలింగ్ నిర్వహించారు.
మహిళలు, విద్యార్థినులకు ఇబ్బందులు కలిగించే ఆకతాయిలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి చర్యలు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా 163 హాట్‌స్పాట్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ మహిళలు, విద్యార్థినుల భద్రతను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.
బాల్యవివాహాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించిన షీ టీం బృందాలు ఆగస్టు నెలలో 2 బాల్యవివాహాలను అడ్డుకోవడంలో కీలక పాత్ర పోషించాయి. బాల్యవివాహాలు జరగకుండా నిరంతరం పర్యవేక్షించాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు.
మహిళలు, చిన్నారులను వేధించే ఆకతాయిలపై ఎలాంటి ఉపేక్ష లేకుండా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని, అవసరమైన సందర్భాల్లో ఈ-పెట్టి కేసులు, ఎఫ్ఐఆర్లు నమోదు చేయాలని ఎస్పీ సూచించారు. పాఠశాలలు, కళాశాలలను ఎక్కువగా సందర్శిస్తూ విద్యార్థులతో మమేకమై వారి సమస్యలను తెలుసుకోవాలని, వేధింపులను అరికట్టేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు.
మహిళలు, విద్యార్థినుల భద్రత, సైబర్ నేరాలు, మహిళలపై వేధింపులు, బాల్యవివాహాల నివారణ తదితర అంశాలపై జిల్లా వ్యాప్తంగా 48 అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు సోషల్ మీడియా వినియోగం, వ్యక్తిగత సమాచార భద్రత, సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు.
మహిళలు, విద్యార్థినులు సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తులతో వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోకూడదని ఎస్పీ సూచించారు. ఫోటోలు, వీడియోలను దుర్వినియోగం చేసి బ్లాక్‌మెయిల్ లేదా వేధింపులకు పాల్పడే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి ఇబ్బంది ఎదురైనా భయపడకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని తెలిపారు.
ఈ సందర్భంగా షీ టీం సభ్యులు, పోలీస్ అక్కల పనితీరును సమీక్షించిన ఎస్పీ.. విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందిని అభినందించారు. వారికి ప్రశంస పత్రాలు, నగదు రివార్డులు అందజేసి ప్రోత్సహించారు.
మహిళలు, విద్యార్థినులకు అండగా షీ టీం బృందాలు నిరంతరం అందుబాటులో ఉంటాయని, అత్యవసర పరిస్థితుల్లో షీ టీం నెంబర్ 8712659953 లేదా డయల్ 100/112కు సంప్రదించాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ పరిపాలన పి మౌనిక ఐపీఎస్, ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, ఎస్బిఐ డీఎస్పీ ఎం వెంకట నరసయ్య, పట్టణ సిఐలు, షి టీం బృంద సభ్యులు సుశీల, రోహిణి, లావణ్య, మహేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భూ సర్వేను సకాలంలో పూర్తి చేయాలి.

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్.




సి కె న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 03,భూముల రీ-సర్వే ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలని తెలంగాణ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి డి.ఎస్. లోకేశ్‌కుమార్ అధికారులకు సూచించారు. గురువారం భద్రాద్రి కొత్తగూడెం ఐడీఓసీలో ఉమ్మడి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు.
భూ సర్వే, సాదాబైనామా, రెవెన్యూ సదస్సులు తదితర అంశాలపై సమీక్షించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీ-సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు.
సమావేశానికి హాజరైన లోకేశ్‌కుమార్, రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి (రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్) రాజీవ్‌గాంధీ హనుమంతును భద్రాద్రి కలెక్టర్ అంకిత్ సాదరంగా ఆహ్వానించి పూల మొక్కను అందజేశారు. ఖమ్మం కలెక్టర్ దివాకర్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, భద్రాచలం సబ్‌కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, కల్లూరు సబ్‌కలెక్టర్ అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా పాలనకు 1000 రోజులు

- గుడిహత్నూర్‌లో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు



సికె. న్యూస్ గుడియాత్నూర్ గుడిహత్నూర్: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన ప్రారంభించి 1000 రోజులు పూర్తిచేసుకున్న సందర్భంగా గుడిహత్నూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ స్తూపం వద్ద కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు మిఠాయిలు పంచుకొని ఆనందం వ్యక్తం చేశారు.
గుడిహత్నూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పలువురు పార్టీ నాయకులు హాజరయ్యారు.
ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తొడసం దౌలత్ రావు మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయానికి ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజా పాలనకు కొత్త దిశను చూపుతున్నామని పేర్కొన్నారు.
కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తెలంగాణ పట్ల వివక్ష చూపుతోందని తొడసం దౌలత్ రావు విమర్శించారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు, హక్కుల విషయంలో కేంద్రం తగిన సహకారం అందించడం లేదని ఆరోపించారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తోందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల కోసం చేపడుతున్న కార్యక్రమాలను కార్యకర్తలు ప్రతి గ్రామానికి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో డీసీసీ జనరల్ సెక్రెటరీ శ్రీమతి ఉయిక అనసూయ, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు వాగ్మారె విశ్వాంబర్, సూర్యగూడ సర్పంచ్ రహీం, మాజీ గుడిహత్నూర్ జడ్పీటీసీ మాస్కె మాధవ్, కోలారి మాజీ సర్పంచ్ బాలాజీ పటేల్, లింగాపూర్ ఉప సర్పంచ్ మోతివర్ గణపతి, వార్డు మెంబర్లు మాజీద్, ఆసిఫ్, అరీఫ్, గణేష్ గౌడ్, పోలె విష్ణు, జలీల్, సత్యనారాయణ, మెస్రం నారాయణ, ఆడే జైపాల్, రాథోడ్ రమేష్, తార రమేష్, శేఖర్,డోమటి సురేష్, వసిం ఖాన్ తదితర మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భక్తుల జీవితం ఆదర్శంగా జీవించాలి: రాంబాబు.



సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.చింతకాని :భక్తుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక విలువలతో జీవించాలని బ్రదర్ డి.రాంబాబు అన్నారు. మండల పరిధిలోని మండల ఫెలోషిప్ ఆధ్వర్యంలో చింతకాని క్రైస్ట్ చర్చిలో నిర్వహించిన మండల ఫెలోషిప్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.లి
ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ.. బైబిల్‌లోని అబ్రహాము, యోబు, వలే తదితర భక్తుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని విశ్వాసం, సహనం, నీతి మార్గంలో జీవించాలని సూచించారు. భక్తుల జీవితాల్లోని విలువలను నేటి తరానికి ఆదర్శంగా నిలపాలని పేర్కొన్నారు. సమావేశంలో ఫెలోషిప్ ప్రతినిధులు, క్రైస్తవ సంఘం సభ్యులు, తదితరులు, పాల్గొన్నారు.

# ప్రాథమిక పాఠశాలలో యూనిఫామ్ పంపిణిచేసిన సర్పంచ్ ఆవుల నరసింహారావు



సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.చింతకాని మండలంబస్వపుర గ్రామం ఉన్న ప్రాథమిక ఉన్నత పాఠశాలలో సర్పంచ్ ఆవుల నరసింహారావు యూనిఫామ్ పంపిణి చేశారు.
ప్రజా ప్రభుత్వం వచ్చిన తరవాత విద్యార్థుల కు ఎన్నో మౌలిక సదుపాయాలు కల్పిస్తుంది, విద్యార్థుల మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని పేదింటి కుటుంబల తలరాతను మార్చేది ఒక్క చదువు ఒక్కటే అని ఆకాంక్షంచారు
ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు,మరియు విద్యార్థులు పాల్గొన్నారు

# భద్రాచలం భగవాన్‌దాస్ కాలనీలో భక్తిశ్రద్ధలతో కర్ర పూజ...





సి కె న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 03,భద్రాచలం పట్టణంలోని భగవాన్‌దాస్ కాలనీలో శ్రీ విఘ్నేశ్వర గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గురువారం కర్ర పూజ కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గణనాథుని ఉత్సవాలకు శ్రీకారం చుడుతూ నిర్వహించిన ఈ పూజా కార్యక్రమానికి కాలనీ వాసులతో పాటు పట్టణంలోని భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.
వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ కర్ర పూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు గణపతిని స్మరిస్తూ ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. కార్యక్రమం సందర్భంగా కాలనీలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. గణనాథుని నామస్మరణతో పరిసర ప్రాంతాలు మార్మోగాయి.
గణేష్ ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు, కాలనీ వాసులు సమష్టిగా ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడంతో నిర్వాహకులు ఆనందం వ్యక్తం చేశారు.
ఈ కార్యక్రమంలో పులపాటి నాగేశ్వరరావు, కుంజ ధర్మా, సున్నం భూలక్ష్మి, శుభలక్ష్మి, రామకృష్ణ, రాంబాబు, హరి, కుంజ సంతోష్, సాయి కౌశిక్, రాజా, మణి, నిర్మల, మాధవి ,నాగేశ్వర రావు, సందీప్, బుబమ్మ, శ్రీదేవి, శ్రీను, ఝాన్సీ, గౌరి, భాస్కర్ రావు, విష్ణు, , నందిని, లక్ష్మీ, సునీత, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగ అభ్యర్థులకు 24 గంటల్లో సర్టిఫికెట్లు జారీ చేయాలి.



భద్రాచలం ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షుడు సరెళ్ల వెంకటేష్ డిమాండ్.

సి కె న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 03,పోలీస్ కానిస్టేబుల్, ఎస్ఐ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే నిరుద్యోగ అభ్యర్థులకు అవసరమైన కులం, ఆదాయం, నివాస ధ్రువీకరణ పత్రాలను ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి 24 గంటల్లో జారీ చేయాలని భద్రాచలం నియోజకవర్గ ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షుడు సరెళ్ల వెంకటేష్ డిమాండ్ చేశారు.
తెలంగాణ ప్రభుత్వం 7,437 కానిస్టేబుల్, ఎస్ఐ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయగా, దరఖాస్తులకు సెప్టెంబర్ 9 చివరి తేదీగా నిర్ణయించింది. అయితే భద్రాచలం నియోజకవర్గంలోని వందలాది మంది యువత గత 15 రోజులుగా ధ్రువీకరణ పత్రాల కోసం ఎంఆర్ఓ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా జాప్యం జరుగుతోందని వెంకటేష్ పేర్కొన్నారు.
వీఆర్వోలు, ఆర్ఐలు ఎస్ఐఆర్ (ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ) పనుల్లో నిమగ్నమై ఉండటంతో సర్టిఫికెట్ల జారీ ఆలస్యమవుతోందని అధికారులు చెబుతున్నారని తెలిపారు. దీంతో దరఖాస్తు గడువు సమీపిస్తున్న నేపథ్యంలో ముఖ్యంగా గిరిజన, పేద విద్యార్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని అన్నారు.
ఎస్ఐఆర్ పనులు ఒకవైపు, విద్యార్థుల భవిష్యత్తు మరోవైపు అని పేర్కొన్న ఆయన, ఉద్యోగ అభ్యర్థుల సర్టిఫికెట్ల కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి 24 గంటల్లో జారీ చేయాలని కోరారు. గడువులోగా సర్టిఫికెట్లు అందని అభ్యర్థుల కోసం దరఖాస్తు గడువు పొడిగించేలా టీఎస్ఎల్‌పీఆర్బీతో ప్రభుత్వం చర్చించాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారులు వెంటనే జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు.

# శబరి మాతాజీ ఆశ్రమంలో ఘనంగా అఖండ జ్యోతి



సికె. న్యూస్ బోత్ కనకగుట్ట గ్రామంలోని శ్రీ శ్రీ శ్రీ పరమహంస సచ్చిదానంద సద్గురు శ్రీ శబరి మాతాజీ ఆశ్రమంలో అఖండ జ్యోతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.
గ్రామస్థుల ఆహ్వానం మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి లితెలంగాణ రక్షణ సేన పార్టీ బోథ్ ఇంచార్జ్, రాష్ట్ర అబ్జర్వర్ శ్రీ రాథోడ్ బాపురావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని, సద్గురు శ్రీ శబరి మాతాజీ ఆశీస్సులు పొందారు.
ఈ కార్యక్రమంలో రాథోడ్ బాపురావు గారితో పాటు తెలంగాణ రక్షణ సేన పార్టీ నాయకులు,నేరడిగొండ మండల కన్వీనర్ బానోత్ వసంత్ రావు.కార్యకర్తలు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో జరిగిన ఈ కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో ఉత్సాహంగా కొనసాగింది.
కార్యక్రమం అనంతరం గ్రామస్థులు, ఆశ్రమ నిర్వాహకులు రాథోడ్ బాపురావు గారిని సాదరంగా సత్కరించారు.

# ఏనుబై వసంతాల సందర్భంగా పిఆర్ సి ని, వెంటనే ప్రకటించాలి

- మండల ఉపాధ్యాయులు







**సెప్టెంబరు 03 (సీ కే న్యూస్) చేగుంట :**చేగుంట మండలంలో ఎస్ టి యు సభ్యత్వాలు నమోదు కార్యక్రమంలో భాగంగా జిల్లా ప్రధాన కార్యదర్శి నరేష్ మాట్లాడుతూ ప్రభుత్వం గత రెండు మూడు సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న ఆరు డీఏలను వెంటనే విడుదల చేయాలని పిఆర్సి ఇప్పటికే చాలా ఆలస్యమైంది కావున వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు

ఇదే కార్యక్రమంలో రాష్ట్ర బాధ్యులు వారాల నరసింహులు గందె పాండు గారు మాట్లాడుతూ ఉద్యోగులకు శాపంగా మారిన సిపిఎస్ ను రద్దు చేస్తూ పాత పెన్షన్ తీసుకురావాలని మరియు జిల్లా బాధ్యులు శివ ప్రసాద్ మాట్లాడుతూ గత మూడు నెలలుగా ఉపాధ్యాయుల నుండి ఆరోగ్య పథకం కోసం డబ్బులు తీసుకుంటున్నప్పటికీ ఆరోగ్యపతకం సక్రమంగా అమలు కావడం లేదని వెంటనే దీన్ని సవరించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో జిల్లా బాధ్యులు సత్యనారాయణ చేగుంట మండల అధ్యక్షుడు పెంటా గౌడ్ ప్రధాన కార్యదర్శి మనోహర్ జిల్లా కౌన్సిలర్లు సిద్ధిరాములు, సత్యనారాయణ, బంగారయ్య మండల కోశాధికారి ఎస్ కే సలీం తదితరులు పాల్గొన్నారు

# వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు

- మహానేత డా. వై.ఎస్. రాజశేఖర రెడ్డి వర్ధంతి సందర్భంగా చిన్నమండవ గ్రామంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** చిన్నమండ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీ పర్చగాని వెంకట్రాములు అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో చిన్నమండవ గ్రామ ఉపసర్పంచ్ తంగిరాల మాధవి, వార్డు మెంబర్లు గుండ్ల అనిల్, కాశిమాల కిరణ్ కుమార్, చింతకాని మండలం యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఆత్మకూరు రవికుమార్, కిసాన్ సెల్ అధ్యక్షుడు పర్చగాని సీతయ్య, కాశిమాల అశోక్, వల్లపట్ల రమేష్, ఏసోబు, జెట్టు శ్రీను, తంగిరాల నరసింహారావు, గుండ్ల వెంకటేశ్వర్లు, లింగం అంజయ్య, నాగభూషి, తదితరులు పాల్గొని వైఎస్సార్ కి ఘన నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. వైఎస్సార్ అమలు చేసిన సంక్షేమ పథకాలు, పేదలు, రైతులు, బడుగు బలహీన వర్గాల కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. వైఎస్సార్ గారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ సభ్యులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# భద్రాద్రికి రైలుబాట.. అభివృద్ధికి తొలి అడుగు.




- సాకేతపురి వరకు 16 కి.మీ. రైల్వే లైన్‌కు గ్రీన్‌సిగ్నల్
- మంత్రి తుమ్మల విజ్ఞప్తికి కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ సానుకూల స్పందన.

**సి కె న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 03** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అభివృద్ధికి కీలకమైన పాండురంగాపురం--మల్కన్‌గిరి రైల్వే లైన్ నిర్మాణానికి మరోసారి కదలిక వచ్చింది. ప్రాజెక్టు పూర్తికి పలు అవరోధాలు ఉన్న నేపథ్యంలో.. పాండురంగాపురం నుంచి సాకేతపురి (సారపాక) వరకు సుమారు 16 కి.మీ. రైల్వే లైన్ పనులను ముందుగా చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి.. పనులను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని రైల్వే అధికారులను ఆదేశించారు.

**భూసేకరణకు రాష్ట్రం సిద్ధం**

పాండురంగాపురం--మల్కన్‌గిరి పూర్తి రైల్వే లైన్‌కు భూసేకరణ, అటవీ అనుమతులు, గోదావరి వంతెనతో పాటు ఇతర వంతెనల నిర్మాణం వంటి అంశాలు అవరోధాలుగా ఉన్నాయని మంత్రి తుమ్మల కేంద్ర మంత్రికి వివరించారు. వీటి పరిష్కారానికి సమయం పట్టే అవకాశం ఉన్నందున.. పెద్దగా అవరోధాలు లేని పాండురంగాపురం--సాకేతపురి మార్గాన్ని ముందుగా పూర్తి చేయాలని కోరారు. ఈ మార్గానికి అవసరమైన భూమిని రాష్ట్ర ప్రభుత్వం సేకరించి రైల్వే శాఖకు అప్పగించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు.

**భద్రాచలానికి ప్రయోజనం.**

సాకేతపురి వరకు రైల్వే సౌకర్యం అందుబాటులోకి వస్తే భద్రాచలానికి రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. దక్షిణ అయోధ్యగా పేరొందిన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. దీంతో ఆధ్యాత్మిక పర్యాటకం, స్థానిక వ్యాపారాలు, ఉపాధి అవకాశాలకు ఊతం లభించనుంది.

**పారిశ్రామిక రంగానికీ ఊతం.**

రైల్వే కనెక్టివిటీతో జిల్లాలోని సింగరేణి, బీపీఎల్, కేటీపీఎస్ తదితర పరిశ్రమలకు ముడిసరుకు, ఉత్పత్తుల రవాణా సులభతరం కానుంది. కొత్త పరిశ్రమలు, పెట్టుబడులను ఆకర్షించేందుకు కూడా ఇది దోహదపడుతుందని అధికారులు భావిస్తున్నారు.

కేంద్రం సానుకూల స్పందన నేపథ్యంలో పాండురంగాపురం--సాకేతపురి మధ్య భూసేకరణను వేగవంతం చేసి రైల్వే శాఖకు భూమిని అప్పగించేలా చర్యలు చేపట్టాలని మంత్రి తుమ్మల అధికారులను ఆదేశించారు. సాకేతపురి వరకు రైల్వే లైన్ నిర్మాణం భద్రాద్రి అభివృద్ధికి కీలక మలుపుగా నిలవనుంది.

# ఇల్లందులో పోలీస్ అధికారులతో సమన్వయ సమావేశం - జూనియర్ సివిల్ జడ్జి స్వరూప కాటం



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, సీకే న్యూస్, సెప్టెంబర్ 3,** ఇల్లందు ప్రతినిధి : -

ఈ నెల 12 న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయడానికి పోలీస్ అధికారులు బాధ్యతాయుతంగా సహకరించాలని ఇల్లందు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి స్వరూప కాటం పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం ఇల్లందు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో, కోర్టు పరిధిలోని పోలీస్ స్టేషన్ల స్టేషన్ హౌస్ ఆఫీసర్ల (ఎస్.హెచ్.ఓ) తో నిర్వహించిన ప్రత్యేక సమన్వయ సమావేశానికి జడ్జి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా జడ్జి స్వరూప కాటం మాట్లాడుతూ... రాజీపడదగిన కేసులను గుర్తించి, ఇరువర్గాల మధ్య సమన్వయం కుదర్చడంలో ఎస్. హెచ్. ఓ. లు కీలక పాత్ర పోషించాలన్నారు. లోక్ అదాలత్ వల్ల కలిగే ప్రయోజనాలు, దాని ప్రాముఖ్యతపై ప్రజలకు, బాధితులకు స్పష్టమైన అవగాహన కల్పించాలని సూచించారు. ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో ముందస్తు కౌన్సిలింగ్ నిర్వహించి, గరిష్ట సంఖ్యలో కేసులు రాజీ అయ్యేలా కృషి చేయాలని కోరారు.

ఈ సమావేశంలో కోర్టు సూపరింటెంట్ రామకృష్ణ, ఇల్లందు కోర్టు పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్ల ఎస్. హెచ్. ఓ. లు, కోర్టు కానిస్టేబుళ్లు మరియు కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పేదల వైద్యానికి ఎమ్మెల్యే అండ.



**సికే న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు సెప్టెంబర్ 2.** యాదాద్రి భువనగిరి జిల్లా

వలిగొండ: పేదల వైద్యానికి భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అండగా నిలుస్తున్నారని సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు, సర్పంచ్ రేసు బుచ్చిరెడ్డి అన్నారు. మండలంలోని గ్రామానికి చెందిన పల్లపు వెంకటేశం కుమారుడు పనిత్‌కుమార్ వైద్య ఖర్చుల నిమిత్తం రూ.2.50 లక్షల ఎల్‌ఓసీ చెక్కును ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా వెంకటేశం సోదరుడు ఉపేందర్‌కు అందజేశారు. గత ఎనిమిది నెలల క్రితం కూడా వైద్య ఖర్చుల కోసం రూ.2 లక్షల ఎల్‌ఓసీ చెక్కును అందించినట్లు తెలిపారు. పేదల వైద్యం కోసం తాను కోరిన వెంటనే స్పందించి ఎల్‌ఓసీ చెక్కులు మంజూరు చేస్తున్న ఎమ్మెల్యేకు రేసు బుచ్చిరెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బత్తిని సాదేవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బుక్యా నాయక్, సింగిల్ విండో చైర్మన్ గారిసె రవి, మత్స్యగిరిగుట్ట చైర్మన్ తుమ్మల శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ పద్మ అనంతరెడ్డి, సింగిల్ విండో వైస్ చైర్మన్ జక్కజంగ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాశం సత్తిరెడ్డి, మాజీ ఎంపీపీ నూతి రమేష్‌రాజు, చెరుకు శివయ్య, దుబ్బ దానయ్య, చలిగంజి పృధ్వి, చలిగంజి వీరస్వామి, బద్దం సంజీవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు జానకిరామ్, మాజీ సర్పంచ్ మల్లేశం, కంచనపల్లి మాజీ ఉపసర్పంచ్ జక్క రాజేందర్‌రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనకు వెయ్యి రోజులు.. మధిరలో కేక్ కట్ చేసి ఘన సంబరాలు

**మధిరసెప్టెంబర్ 03(సికె న్యూస్)ప్రతినిధి** మధిర: కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా మధిర పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఘనంగా సంబరాలు నిర్వహించారు. మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పారుపల్లి విజయకుమార్ మున్సిపల్ చైర్మన్ సామినేని సుజాత, జిల్లా కాంగ్రెస్ నాయకులు వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తూ ముందుకు సాగుతోందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పాలన కొనసాగిస్తోందని తెలిపారు. మహిళలు, రైతులు, యువత, పేదలు, విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజల కోసం నిరంతరం పనిచేస్తోందని, మధిర నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వారు





పేర్కొన్నారు. మధిర నియోజకవర్గ అభివృద్ధికి

# ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని రూ.2 లక్షలు మోసం -- కేసు నమోదు

- ఆర్అండ్‌బీ శాఖ లేదా కలెక్టరేట్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి డబ్బులు వసూలు
- మోసమని గ్రహించిన తర్వాత పోలీసులను ఆశ్రయించిన బాధితుడు.
- ఆదిలాబాద్ రూరల్ సీఐ రహీం పాషా



**సికె. న్యూస్ ప్రతినిధి.ఆదిలాబాద్ :**ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి ఓ యువకుడి వద్ద నుంచి రూ.2 లక్షలు తీసుకుని మోసానికి పాల్పడిన వ్యక్తిపై తలమడుగు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఆదిలాబాద్ రూరల్ సీఐ రహీం పాషా తెలిపారు.

తలమడుగు మండలం కజ్జర్ల గ్రామానికి చెందిన కర్నేవార్ ప్రేమ్ (26) చదువు పూర్తి చేసుకుని ప్రభుత్వ ఉద్యోగానికి సిద్ధమవుతున్నాడు. ఈ క్రమంలో భరంపూర్ గ్రామానికి చెందిన నిందితుడు ఎం.డి. రఫీక్ ఏ మహ్మద్ రఫీక్ (42) తనకు ఆర్అండ్‌బీ శాఖలో లేదా కలెక్టరేట్‌లోని సెక్షన్-4లో ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించాడు. రఫీక్ మాటలను నమ్మిన బాధితుడు 08-05-2026న తన నివాసం వద్ద రూ.2 లక్షలు చెల్లించాడు. ఉద్యోగం ఇప్పిస్తానని సుమారు ఐదు నెలల పాటు బాధితుడిని నమ్మిస్తూ వచ్చిన రఫీక్ అనంతరం ఫోన్ నంబర్‌ను బ్లాక్ చేసి, బాధితుడికి అందుబాటులో లేకుండా పోయాడు. పలుమార్లు రఫీక్ ఇంటికి వెళ్లినా డబ్బులు తిరిగి ఇవ్వకుండా తప్పించుకున్నట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు తలమడుగు పోలీస్ స్టేషన్‌లో క్రైం నంబర్ 177/2026, సెక్షన్ 316(5), 318(4) దీఝ కింద కేసు నమోదు చేసి ఎస్సై డి రాధిక దర్యాప్తు చేపట్టినట్లు సీఐ రహీం పాషా తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగాల పేరుతో ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే నమ్మి మోసపోవద్దని, ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పే వ్యక్తుల మాటలను నమ్మి డబ్బులు చెల్లించవద్దని పోలీసులు సూచించారు.

# సంకల్ప్ ప్రాజెక్టు కింద రిమ్స్ చిన్న పిల్లల విభాగం ఎంపిక: కలెక్టర్ రాజర్షి షా

**సికె.న్యూస్.ప్రతినిధిబిఆదిలాబాదు:**కేంద్ర ప్రభుత్వం ద్వారా అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలవుతున్న సంకల్ప్' ప్రాజెక్టు కింద ఆదిలాబాద్‌లోని రిమ్స్ ఆసుపత్రి చిన్న పిల్లల విభాగం ఎంపిక కావడం శుభపరిణామమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ××ఎఫీఔ చైర్పర్సన్ డా. కవిత రెడ్డి సీలం తో కలిసి వైద్య శాఖ అధికారులతో సంకల్ప్ ప్రాజెక్ట్, రిమ్స్ లో వైద్య సేవలు, ఇతర అంశాలపై ఆయన సమీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రిమ్స్ ఆసుపత్రిలోని చిన్న పిల్లల విభాగంలో అందుతున్న వైద్య సేవలు, అక్కడ అందుబాటులో ఉన్న వసతులు, మౌలిక సౌకర్యాలు మరింత మెరుగుపడనున్నాయని అన్నారు. మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు జిల్లా యంత్రాంగం అవసరమైన సహకారం అందిస్తామని అన్నారు.

ఈ కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ డా.రాథోడ్ జైసింగ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.సాధన, ఇతర వైద్య బృందం, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధి ప్రణాళికతో గుర్తింపు పొందిన ఖమ్మంపాడు
# సర్పంచ్ బట్ట అంజన బాబు కు ఘన సన్మానం





**మధిర సెప్టెంబర్ 03 (సికె న్యూస్)ప్రతినిధి.**
మధిర: గ్రామాభివృద్ధిపై స్పష్టమైన ప్రణాళికతో ముందుకు సాగుతూ హైదరాబాద్‌లోని ం+×=ణలో నిర్వహించిన ఎడీ+=ూవీ శిక్షణ కార్యక్రమంలో ఖమ్మంపాడు గ్రామాభివృద్ధి మ్యాప్‌ను సమర్థవంతంగా ప్రదర్శించి పంచాయతీ రాజ్ కమిషనర్‌చే అభినందనలు పొందిన ఖమ్మంపాడు గ్రామ సర్పంచ్ బట్ట అంజన బాబు ను మధిర పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.
మధిర పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పారుపల్లి విజయకుమార్, మున్సిపల్ చైర్మన్ సామినేని సుజాత, మున్సిపల్ వైస్ చైర్మన్ కోనాధని కుమార్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చావా వేణు తదితరులు బట్ట అంజన బాబు ను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.
ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధికి అవసరమైన పనులను మ్యాప్ రూపంలో గుర్తించి, వాటిని ప్రాధాన్యతా క్రమంలో అమలు చేసేందుకు ఎడీ+=ూవీ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఖమ్మంపాడు గ్రామ అభివృద్ధి ప్రణాళికను శిక్షణ కార్యక్రమంలో సమర్థవంతంగా వివరించి అధికారుల ప్రశంసలు అందుకోవడం అభినందనీయమన్నారు.
ప్రజల భాగస్వామ్యంతో గ్రామాలను సమగ్రంగా అభివృద్ధి చేయాలనే ఆలోచనతో బట్ట అంజన బాబు ముందుకు సాగడం అభినందనీయమని నాయకులు పేర్కొన్నారు. నీటి సంరక్షణ, ఇంకుడు గుంతలు, వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా గ్రామాన్ని అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు.

## వెయ్యి రోజులు.. 420 హామీలు.. అమలేది కాంగ్రెస్?.



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తూ చింతకాని మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని లచ్చగూడెం గ్రామం నుంచి చింతకాని తహసీల్దార్ కార్యాలయం వరకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీగా బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ 420 హామీలు, గ్యారెంటీ కార్డులు చూపించి ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను సక్రమంగా అమలు చేయకుండా ప్రజలను, రైతులను మభ్యపెడుతోందని విమర్శించారు. వంద రోజుల్లో హామీలను అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజులు గడుస్తున్నా ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో హామీల అమలుకు బాండ్ పేపర్లపై హామీలు ఇచ్చి, గ్యారెంటీ కార్డులను ముద్రించి ప్రజలకు అందించిన విషయాన్ని గుర్తుచేస్తూ.. నేడు ఆ గ్యారెంటీ కార్డులను భద్రంగా దాచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఎద్దేవా చేశారు. ముఖ్యంగా రైతులకు ఇచ్చిన హామీల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని ఇచ్చిన హామీని పూర్తిస్థాయిలో అమలు చేయాలని, రైతు భరోసా కింద ఎకరాకు రూ.15 వేల చొప్పున ఇస్తామని హామీ ఇచ్చి ప్రస్తుతం రూ.12 వేలకు పరిమితం చేశారని విమర్శించారు. వరి ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని హామీ ఇచ్చి రైతులను మోసం చేశారని ఆరోపించారు. రైతు బీమా, పంటల రక్షణ, గిట్టుబాటు ధర తదితర అంశాల్లోనూ రైతులకు పూర్తి స్థాయిలో న్యాయం జరగడం లేదని అన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు రుణమాఫీ, రైతు భరోసా, ధాన్యం బోనస్, రైతు బీమా వంటి హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. 1000 రోజులు గడిచినా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం ప్రజలను, రైతులను మోసం చేయడమేనని బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఇకనైనా కాలయాపన చేయకుండా తక్షణమే అమలు చేసి రైతులకు, ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం బీఆర్ఎస్ పార్టీ ప్రజలు, రైతుల తరఫున నిరంతరం పోరాటం చేస్తుందని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంకెన రమేష్, బొడ్డు వెంకట రామారావు, గురజాల హనుమంతరావు, గడ్డం శ్రీను, వంకాయలపాటి సత్యనారాయణ, సామినేని అప్పారావు, కొండూరు పరిశుద్ధ రావు, చాపలమడుగు వీరబాబు, గోగుల నరసింహారావు, సూర్నాకంటి నాగేశ్వరావు, మరీదు భూపతిరావు, జావిద్, షేక్ మీరా సాహెబ్, నాదెండ్ల వెంకటేష్‌తో పాటు మండలంలోని సర్పంచ్‌లు, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# యూరియా ఇవ్వడానికి చేతకానీ ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం

- రైతుల వెన్నంటి నిలిచింది బీఆర్ఎస్ ప్రభుత్వమే
- బీఆర్ఎస్ హయాంలో రైతులకు భరోసా..
- కాంగ్రెస్ పాలనలో రైతులకు కష్టాలే..
- యూరియా కోసం రైతుల అవస్థలు
- తాండూరుకు రూ.1,680 కోట్ల నిధులు తెచ్చాం
- పెద్దేముల్ మండల కేంద్రంలో నిర్వహించిన రైతు సమరభేరిలో
- తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి



**సికే న్యూస్ పెద్దేముల్ ప్రతినిధి,సెప్టెంబర్ 3:**
రైతులకు యూరియా ఇవ్వడానికి చేతకానీ ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని,బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులు సంతోషంగా ఉన్నారని, రైతులకు వెన్నుదన్నుగా నిలిచిన ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వమేనని తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి అన్నారు.గురువారం పెద్దేముల్ మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ అధిష్టానం, మాజీ సీఎం కేసీఆర్ పిలుపు మేరకు పెద్దేముల్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోహిర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు సమరభేరి కార్యక్రమంలో పాల్గొని రైతులను ఉద్దేశించి ప్రసంగించారు.
ఈ సందర్భంగా తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి మాట్లాడుతూ....
ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు.ముఖ్యంగా రైతులకు రైతుబంధు ద్వారా ఎకరాకు రూ.10 వేల పెట్టుబడి సాయం, రైతుబీమా ద్వారా రైతు మృతి చెందితే కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం, ధాన్యం కొనుగోలు కేంద్రాలు, ప్రతి 5 వేల మంది రైతులకు ఒక వ్యవసాయ విస్తరణాధికారి, రైతువేదికల నిర్మాణం వంటి కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు.

**కాంగ్రెస్ హామీలు ఎక్కడ..?**
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని రోహిత్‌రెడ్డి విమర్శించారు.రైతు రుణమాఫీ పూర్తిగా అమలు కాలేదని,రైతుబంధు సక్రమంగా అందడం లేదని,ధాన్యానికి ప్రకటించిన రూ.500 బోనస్ కూడా అందడం లేదని ఆరోపించారు.రైతుల పంటలను కొనుగోలు చేసేందుకు అధికారులు ముందుకు రావడం లేదని అన్నారు.100 రోజుల్లో అన్ని హామీలు అమలు చేస్తామని చెప్పి ప్రస్తుతం 1000 రోజులు గడిచినా పరిస్థితిలో మార్పు రాలేదని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కో రైతుకు రైతు భరోసా ద్వారా 4 ఎకరాల రైతుకు రూపాయలు ఒక లక్ష రెండు వేల రూపాయలు బాకీ పడిందని రుణమాఫీ ద్వారా రెండు లక్షలు బాకీ పడిందని అన్నారు.వరి పంటకు రూపాయలు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి ప్రతి ఎకరానికి రూపాయలు రూ.12,500 హామీ, 6 పంటలకు ప్రతి ఎకరాకు రూ.75 వేల రూపాయలు రైతులకు బాకీ పడిందని అన్నారు.రైతు కూలీలకు సంవత్సరానికి రూ. 12 వేల రూపాయల హామీ ఇచ్చి రెండు సంవత్సరాలకు రూ.24 వేల రూపాయల బాకీ పడిందని గుర్తు చేశారు.

**యూరియా కోసం రైతుల అవస్థలు**
రాష్ట్రంలో యూరియా కోసం రైతులు నానా అవస్థలు పడుతున్నారని, ప్రతిరోజూ ఎరువుల కోసం పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడిందని రోహిత్‌రెడ్డి అన్నారు.రైతులు పంటలు సాగు చేసే సమయంలో విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,పాముకాట్ల ఘటనలు సైతం మళ్లీ పెరుగుతున్నాయని ఆరోపించారు.రైతులకు జరుగుతున్న అన్యాయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు,వారికి అండగా నిలిచేందుకు రైతు సమరభేరి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.

**రైతులు, మహిళలు, యువత అప్రమత్తంగా ఉండాలి**
కాంగ్రెస్ నాయకులు ఎన్నికల సమయంలో ఓట్ల కోసం గ్రామాలకు వస్తే ఇచ్చిన హామీలను గుర్తు చేసి నిలదీయాలని రైతులు,మహిళలు,యువతకు రోహిత్‌రెడ్డి పిలుపునిచ్చారు.కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు, బూటకపు మాటలను ప్రజలు నమ్మవద్దని సూచించారు.రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తుందని, ప్రజలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని అన్నారు.

**ఎమ్మెల్యే గా ఉన్నప్పుడు తాండూరుకు రూ.1,680 కోట్ల నిధులు**
తాను తాండూరు ఎమ్మెల్యేగా ఐదేళ్లు పనిచేసే అవకాశం లభించినప్పటికీ రెండేళ్లు కరోనా పరిస్థితుల్లో, మరో ఏడాది ఎన్నికల ప్రక్రియలో గడిచిపోయిందని రోహిత్‌రెడ్డి తెలిపారు.కేవలం రెండేళ్ల సమయంలోనే అప్పటి సీఎం కేసీఆర్ సహకారంతో తాండూరు నియోజకవర్గానికి సుమారు రూ.1,680 కోట్ల నిధులు తీసుకువచ్చి గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేశామని పేర్కొన్నారు.
తట్టేపల్లి ప్రాంతానికి ఒక టీఎంసీ సాగునీరు తీసుకురావడానికి ప్రణాళికలు రూపొందించామని, కోట్ పల్లి ప్రాజెక్టు పునరుద్ధరణ పనులకు రూ.100 కోట్ల నిధులు వచ్చేలా కృషి చేశామని గుర్తు చేశారు. తాము నిధుల కోసం ప్రయత్నిస్తే ప్రస్తుతం కాంగ్రెస్ నాయకులు తామే నిధులు తెచ్చామని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు.తాండూరు నియోజకవర్గంలో వారం రోజులపాటు ప్రత్యేక కార్యాచరణతో అన్ని మండలాల్లో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు రోహిత్‌రెడ్డి తెలిపారు.రాబోయే రోజుల్లో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల ప్రజలకు బీఆర్ఎస్ పార్టీ తరఫున అండగా ఉంటామని, మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు.అనంతరం బీఆర్ఎస్ కార్యకర్త బ్యాగరి వెంకటయ్య తండ్రి బ్యాగరి నర్సప్ప ఇటీవల మరణించడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. అదేవిధంగా స్థానికంగా ఉన్న ఓ వ్యవసాయ పొలాన్ని పరిశీలించి అక్కడున్న స్థానిక రైతులతో వ్యవసాయ రంగానికి సంబంధించిన పలు విషయాలను రైతులను అడిగి తెలుసుకున్నారు.
ఈ కార్యక్రమంలో పెద్దేము గ్రామ సర్పంచ్ డివై. నర్సింహులు,పెద్దేముల్ మండల ఉపసర్పంచుల సంఘం అధ్యక్షుడు డివై.ప్రసాద్, పెద్దేముల్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోహిర్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి చాకలి రంగయ్య, పెద్దేముల్ మండల బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రుద్రారం గోపాల్ రెడ్డి,టి.రమేష్,జనార్దన్ రెడ్డి,మారేపల్లి వెంకట్ రెడ్డి,ధన్ సింగ్, చిట్లపల్లి అంజయ్య,తలారి వీరప్ప,వెంకటేష్ చారి,మన్ సాన్ పల్లి రవి,బుద్దారం సర్పంచ్ లక్ష్మప్ప,హీరాసింగ్, డీలర్ అంజయ్య, లక్ష్మణ్, రాములు, పెద్దేముల్ మండల, ఆయా గ్రామాల బీఆర్ఎస్ పార్టీ సీనియర్, యువ నాయకులు,పార్టీ కార్యకర్తలులు,ఆయా గ్రామాల రైతులు,గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# స్మార్ట్ కార్డులు పంపిణీ చేసిన షాద్నగర్ ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్

- రేషన్ మాదే.. స్మార్ట్ కార్డులు మావే..
- నిరుపేదల కోసం కాంగ్రెస్ చేసిన సేవలు అనిర్వచనీయం..
- ఎమ్మెల్యే శంకర్, మాజీ ఎమ్మెల్యే బక్కని పరస్పర ప్రశంసలు..
- నాకు, నరసింహులు అన్నకు ఫామ్ హౌస్ లు లేవు: ఎమ్మెల్యే
- కెసిఆర్ కు, అంజయ్య యాదవ్ కు ఉన్నాయి: ఎమ్మెల్యే
- పదేండ్ల నిండా ఉంచి 1000ల పాలన గురించి మాట్లాడతారా అంటూ ఆగ్రహం..
- లింగారెడ్డి గూడాలో స్మార్ట్ కార్డుల పంపిణీ శ్రీకారం

**షాద్నగర్ నియోజకవర్గం సి కె న్యూస్ ప్రతినిధి సెప్టెంబర్ 03 :** ఒకప్పుడు రేషన్ కార్డుల వ్యవస్థను వెలుగులోకి తెచ్చి నిరుపేదల కడుపు నింపిన కాంగ్రెస్ ఈరోజు స్మార్ట్ కార్డుల పంపిణీ ద్వారా మరో అడుగు ముందుకు వేసిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఫరూక్ నగర్ మండలం లింగారెడ్డిగూడెం గ్రామంలో స్మార్ట్ కార్డుల కంపెనీ కార్యక్రమాన్ని ఆయన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వతంత్రం వచ్చిన తర్వాత రేషన్ వ్యవస్థను తీసుకువచ్చిన పార్టీ కాంగ్రెస్ అని అన్నారు. అదేవిధంగా తెలుగుదేశం అధినేత ఎన్టీ రామారావు అడుగు పెట్టాక రెండు రూపాయలకు కిలో బియ్యంతో ఈ వ్యవస్థను మరింత ముందుకు తీసుకువెళ్లాలని ప్రదర్శించారు. కాంగ్రెస్ పార్టీ నిరంతరం ప్రజల గురించి ఆలోచిస్తుందని, దీనిని గుర్తించాలని పేర్కొన్నారు. కెసిఆర్, అంజయ్య యాదవ్, ఇంకా చాలామంది నాయకులకు ఫామ్ హౌస్ ఉన్నాయి అని, నాకు గాని, ఇక్కడున్న మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు అన్నకు గాని ఇలాంటి ఫామ్ హౌస్ లు లేవని ఎద్దేవా చేశారు. పదేళ్లపాటు జనాలను నిండా ముంచి బీఆర్ఎస్ ఇప్పుడు తమ వెయ్యి రోజుల పాలన గురించి ప్రశ్నించడం హాస్యాస్పదమని అన్నారు. ప్రజలు పార్టీలు ఏం చేస్తున్నాయో గమనించి ఆలోచించాలని, అబద్ధపు ప్రచారాలు నమ్మవద్దని స్పష్టం చేశారు.బక్కని నరసింహులు మాట్లాడుతూ ప్రభుత్వం ఏదైనా ప్రజల కోసం పనిచేసినప్పుడు అభినయం దించడం అలవాటు చేసుకోవాలని అన్నారు. అలాగని భజన చేయాల్సిన అవసరం లేదని తప్పులుంటే ప్రశ్నించడం కూడా నేర్చుకోవాలని స్పష్టం చేశారు. పుల్లలు పెట్టడం చాలా తేలిక, కానీ పనిచేయడం అత్యంత కష్టం అని అన్నారు. స్మార్ట్ కార్డులను అరకులు మాత్రమే ఉపయోగించుకోవాలని, దుర్వినియోగం చేయవద్దని సూచించారుఈ సందర్భంగా పార్టీలకు అతీతంగా కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, తెలుగుదేశం మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు ఒకరినొకరు ప్రశంసించుకున్నారు. నిస్వార్థ నాయకుడిగా రూపాయి కూడా సంపాదించుకోకుండా మాజీ ఎమ్మెల్యే నర్సింలు అన్నగారు పనిచేశారని, గ్రామాన్ని కూడా క్రమశిక్షణలో పెట్టారని అభినందించారు. ఆయన వల్ల గ్రామం అన్ని విధాల ముందడుగు వేసిందని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు మాట్లాడుతూ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గ్రామానికి పాలిటెక్నిక్ కళాశాల తీసుకురావడం, గ్రామాభివృద్ధికి అన్ని విధాల సహకరించడం ఎంతో అభినందనీయమని అన్నారు. ఇలాంటి నాయకులను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో నాగయ్య, పిఎసిఎస్ చైర్మన్ చల్లా శ్రీకాంత్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మొహమ్మద్ అలీ ఖాన్ బాబర్, గ్రామ సర్పంచ్ ప్రవీణ్, ఉప సర్పంచ్ లింగారెడ్డిగూడెం అశోక్, చెంది తిరుపతిరెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



# జాతీయ లోక్ అదాలత్ ప్రాముఖ్యత పై అవగాహన కల్పించండి చేయండి



జడ్జి స్వరూప కాటం

**సీకే న్యూస్ ప్రతినిధి ఇల్లందు:** సెప్టెంబర్ 03, ఇల్లందు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టు నందు గురువారం సాయంత్రం ఇల్లందు మండల న్యాయ సేవాధికార సంస్థ వారి ఆధ్వర్యంలో ఇల్లందు కోర్టు పరిధిలో గల పోలీస్ స్టేషన్ ఎస్. హెచ్. ఓ. లతో కో ఆర్డినేషన్ సమావేశం ఏర్పాటు చేసినారు. ఈ కార్యక్రమానికి జడ్జి స్వరూప కాటం ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ వారు మాట్లాడుతూ ఈనెల 12న జరిగే జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో భాగంగా అందరూ ఎస్. హెచ్. ఓ. లు బాధ్యతగా సహకరించి రాజి పడదగిన కేసులను ఇరువర్గాల సమన్వయ పరిచి, లోక్ అదాలత్ యొక్క ప్రాముఖ్యతను తెలియజేస్తూ ఆయా స్టేషన్లో కౌన్సిలింగ్ నిర్వహించి, పెద్ద మొత్తంలో కేసులు రాజీ పడే విధంగా కృషి చేసి లోక్ అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా కోరినారు. ఈ కార్యక్రమంలో జడ్జి తో పాటు, కోర్టు సూపర్డెంట్ రామకృష్ణ, ఇల్లందు కోర్టు పరిధిలోగల పోలీస్ స్టేషన్ ఎస్. హెచ్. ఓ. లు కోర్టు కానిస్టేబుళ్లు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజారోగ్యమే లక్ష్యం.. తిరుమలాపురంలో
# విస్తృత పారిశుద్ధ్య చర్యలు.



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** చింతకాని మండల పరిధిలోని తిరుమలాపురం గ్రామంలో ప్రజల ఆరోగ్య పరిరక్షణకు గ్రామ సర్పంచ్ చాపల మడుగు వీరబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. గ్రామంలోని మొత్తం 8 వార్డుల పరిధిలో కాలువలు, మురుగు నీరు నిలిచే ప్రాంతాలు, పరిసర ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్‌ను విస్తృతంగా చల్లించారు.
ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా కొన్ని ప్రాంతాల్లో మురుగు నీరు నిలిచే అవకాశం ఉండటంతో ముందస్తు చర్యల్లో భాగంగా బ్లీచింగ్ పౌడర్ చల్లింపు కార్యక్రమాన్ని చేపట్టినట్లు సర్పంచ్ తెలిపారు. నిల్వ నీటి కారణంగా దోమలు, వ్యాధికారక క్రిములు వృద్ధి చెందకుండా, గ్రామంలో పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.
ప్రజల ఆరోగ్యమే ప్రధాన లక్ష్యంగా గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని సర్పంచ్ చాపల మడుగు వీరబాబు తెలిపారు. కాలువలు, మురుగు నీరు నిలిచే ప్రాంతాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడంతో పాటు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన ముందస్తు చర్యలు తీసుకుంటామని చెప్పారు.గ్రామంలోని అన్ని 8 వార్డుల్లో ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని పారిశుద్ధ్య చర్యలు చేపట్టడంపై గ్రామ ప్రజలు సర్పంచ్ చాపల మడుగు వీరబాబును అభినందించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా ఉంచేందుకు ప్రజలు కూడా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు గ్రామపంచాయతీకి సహకరించాలని సర్పంచ్ కోరారు.

# ఎన్‌సీఏఏ తరహా కాలేజియేట్ క్రీడా వ్యవస్థ ఏర్పాటుపై తెలంగాణ ప్రభుత్వం కసరత్తు









- పాఠశాల నుంచి అంతర్జాతీయ క్రీడా వేదికల వరకు క్రీడాకారుల అభివృద్ధికి సమగ్ర వ్యవస్థ అవసరం
- ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్

**సి కె న్యూస్ ప్రతినిధి:** అమెరికాలోని నేషనల్ కాలేజియేట్ అథ్లెటిక్ అసోసియేషన్ (ఎన్‌సీఏఏ) నమూనాలో తెలంగాణలో సమగ్ర కాలేజియేట్ క్రీడా వ్యవస్థను అభివృద్ధి చేసే అవకాశాలను రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తున్నదని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (క్రీడలు) శ్రీ జయేష్ రంజన్, ఐఏఎస్ తెలిపారు.

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ , హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ జనరల్ సహకారంతో గురువారం గచ్చిబౌలి క్రీడా సముదాయంలో ఎన్‌సీఏఏ మాజీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (పాలసీ అండ్ గవర్నెన్స్) శ్రీ కెవిన్ లెన్నన్‌తో రెండు ప్రత్యేక అవగాహన, పరస్పర చర్చా సమావేశాలను నిర్వహించింది. క్రీడా, విద్యా రంగాలకు చెందిన 125 మందికి పైగా ప్రతినిధులు ఈ సమావేశాల్లో పాల్గొన్నారు.

దాదాపు నాలుగు దశాబ్దాలపాటు ఎన్‌సీఏఏలో వివిధ కీలక బాధ్యతలు నిర్వహించిన శ్రీ కెవిన్ లెన్నన్, అమెరికా కాలేజియేట్ క్రీడా వ్యవస్థలోని పాలనా విధానం, క్రీడాకారుల అభివృద్ధి, విద్యా అర్హతల ప్రమాణాలు, స్కాలర్‌షిప్ వ్యవస్థ, విద్యాసంస్థల భాగస్వామ్య నమూనాలపై తన అనుభవాలను పంచుకున్నారు.

"అమెరికన్ స్పోర్ట్స్ ఎకోసిస్టమ్ నుంచి పాఠాలు -- తెలంగాణ క్రీడా భవిష్యత్తుకు రోడ్‌మ్యాప్" అంశంపై నిర్వహించిన తొలి సమావేశంలో రెసిడెన్షియల్ విద్యాసంస్థలు, విశ్వవిద్యాలయాలు, క్రీడా సంఘాలు, క్రీడాకారుల అభివృద్ధి సంస్థలు, క్రీడా పారిశ్రామికవేత్తలు, ప్రముఖ క్రీడాకారులు పాల్గొన్నారు.

పాఠశాల క్రీడలు, విశ్వవిద్యాలయ స్థాయి పోటీలు, ప్రతిభావంతులైన క్రీడాకారుల అభివృద్ధిని అనుసంధానించే సమగ్ర వ్యవస్థ రూపకల్పనపై చర్చలు జరిగాయి.

ఈ సందర్భంగా శ్రీ జయేష్ రంజన్ మాట్లాడుతూ తెలంగాణలో అపారమైన క్రీడా ప్రతిభతో పాటు ప్రపంచ స్థాయి క్రీడా మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. పాఠశాల స్థాయి నుంచి విశ్వవిద్యాలయ క్రీడలు, అక్కడి నుంచి జాతీయ, అంతర్జాతీయ పోటీల వరకు క్రీడాకారులు క్రమబద్ధంగా ఎదిగే విధంగా ఒక సమర్థవంతమైన వ్యవస్థ అవసరమని అన్నారు. తెలంగాణకు అనువైన కాలేజియేట్ క్రీడా నమూనా రూపకల్పనలో అమెరికా కాన్సులేట్ జనరల్, క్రీడా మరియు విద్యా రంగాల భాగస్వామ్య సంస్థలతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు.

"ఎన్‌సీఏఏ మరియు కాలేజియేట్ క్రీడా నమూనా అవగాహన" అంశంపై నిర్వహించిన రెండో సమావేశంలో కోచ్‌లు, క్రీడా నిర్వాహకులు, రాష్ట్ర క్రీడా సంఘాల ప్రతినిధులు, ప్రైవేట్ అకాడమీలు, క్లబ్‌లు, శారీరక విద్య నిపుణులు పాల్గొన్నారు. ఎన్‌సీఏఏ పరిపాలనా నిర్మాణం, క్రీడాకారుల సంక్షేమం, విద్యా ప్రగతి, ప్రతిభా గుర్తింపు, స్కాలర్‌షిప్ విధానాలు, క్రీడా నిర్వహణలో అనుసరించే ఉత్తమ పద్ధతులపై శ్రీ కెవిన్ లెన్నన్ వివరించారు.

తెలంగాణ ప్రభుత్వ క్రీడా సలహాదారు, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీ ఎ.పి. జితేందర్ రెడ్డి మాట్లాడుతూ కాలేజియేట్ క్రీడా వ్యవస్థ విజయవంతం కావాలంటే క్రీడా సంఘాలు, అకాడమీలు, విద్యాసంస్థలు, కోచ్‌ల మధ్య సమన్వయం అత్యంత కీలకమని అన్నారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు.

తెలంగాణ అవసరాలకు అనుగుణంగా ఎన్‌సీఏఏ నమూనాలో పాఠశాల, కళాశాల మరియు విశ్వవిద్యాలయ క్రీడలను అనుసంధానించే సమగ్ర క్రీడా వ్యవస్థను అభివృద్ధి చేయాల్సిన అవసరంపై సమావేశాల్లో ఏకాభిప్రాయం వ్యక్తమైంది. ఈ మేరకు వివిధ వర్గాల భాగస్వాములతో సంప్రదింపులు జరిపి రాష్ట్ర ప్రభుత్వ పరిశీలన కోసం కార్యాచరణ ప్రణాళికను సిద్ధంఅ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వైస్ చైర్‌పర్సన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ డా. ఎ. సోనిబాలా దేవి, ఐఎఫ్ఎస్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం నిర్వహణలో సహకరించిన అమెరికా కాన్సులేట్ జనరల్, హైదరాబాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ క్రీడా పర్యావరణ వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి ఈ చర్చలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. 2036 ఒలింపిక్ క్రీడల లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర క్రీడాకారుల అభివృద్ధికి అవసరమైన కార్యాచరణలను రూపొందించేందుకు స్పోర్ట్స్ అథారిటీ చర్యలు చేపడుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఒలింపియన్ సైనా నెహ్వాల్, ఒలింపియన్ సత్తి గీత, ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఇస్మాయిల్ బేగ్, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీ టి. మల్లారెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఉన్నతాధికారులు, విద్యాసంస్థలు, క్రీడా సంఘాలు, అకాడమీలు మరియు ఇతర భాగస్వామ్య సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# షాద్ నగర్ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీగా ర్యాలీ ప్రదర్శన సభ

- కేసీఆర్ ఫామ్ హౌస్ కే పరిమితమై 1000 రోజులు..
- బిఆర్ఎస్ కు కాంగ్రెస్ ఎమ్మెల్యే "వీర్లపల్లి శంకర్" దిమ్మతిరిగే కౌంటర్
- పదేళ్లలో ప్రజలకు ఇచ్చిన వెయ్యి అబద్ధాల హామీలు మరిచారా..?
- దళితున్ని సీఎం చేసే హామీ మొదలుకొని ఎస్టీ, మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్ వరకు బోగస్
- ప్రజల సొమ్ము ఖజానా ఖాళీ చేసింది నీ కుటుంబమే..
- బిఆర్ఎస్ హయాంలో ప్రజల సొమ్మును మిక్కింది మీ మీ మంత్రులు, ఎమ్మెల్యేలు
- ప్రజల సమస్యలను గాలికి వదిలేసి బిఆర్ఎస్ వి విలాసవంతమైన జీవితాలు




**షాద్నగర్ నియోజకవర్గం సి కె న్యూస్ ప్రతినిధి సెప్టెంబర్ 03:** తెలంగాణ రాష్ట్రానికి కాపలా కుక్కలా ఉంటానని చెప్పిన కేసీఆర్ గత వెయ్యి రోజులుగా ఫామ్ హౌస్ కే పరిమితం అయ్యారని తెలంగాణ "కాపలా కుక్క" ఎక్కడికి వెళ్లిందని? షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ బిఆర్ఎస్ పార్టీ తీరుపై భగ్గుమన్నారు.

రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలో గురువారం యువజన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్థానిక మున్సిపల్ వైస్ చైర్మన్ అందెమోహన్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ ప్రదర్శన, సభను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుండి స్థానిక చౌరస్తా వరకు ప్లకార్డులతో ఊరేగింపుగా కాంగ్రెస్ ప్రదర్శన నిర్వహించారు. ఫామ్ హౌస్ లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ లిక్కర్ తాగుతున్నట్టు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి కాంగ్రెస్ నాయకులు రోడ్డుపై వాటిని చెప్పులతో కొడుతూ ఊరేగించారు. షాద్ నగర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన ప్రదర్శన సభలకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరయ్యారు.

గత వెయ్యి రోజులుగా ఫామ్ హౌస్ కే పరిమితమైన కెసిఆర్ తీరును నిరసిస్తూ షాద్ నగర్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ వందలాదిమంది కార్యకర్తలు భారీ ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. ప్రగతి భవన్ ముందు కంచె తొలగించి "ప్రజా భవన్" గా మార్చి దొర అహంకారం దించి నేటికి1000 రోజులు.. కేవలం జీతం కోసమే సంవత్సరానికి ఒకే ఒక్క సారి అసెంబ్లీకి వచ్చేలా చేసే ప్రభుత్వానికి నేటికి 1000 రోజులు.. తనను భావి ముఖ్యమంత్రి అని జాకీలు పెట్టి మరీ లేపేలా చేయడానికి చిన్న దొర జీతగాళ్లకు నెలకు 9 కోట్ల రూపాయలు ఇచ్చేది కూడా 1000 రోజులు.. అంటూ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ బిఆర్ఎస్ పార్టీ తీరుపై ధ్వజమెత్తారు. ప్రభుత్వం రాలేదని ఫామ్ హౌస్ కే పరిమితమైన కేసీఆర్ తెలంగాణకు కాపలా కుక్కలాగా ఉంటానని తన కుటుంబ ఫామ్ హౌస్ కే కాపలా ఉన్నాడు అంటూ ఎమ్మెల్యే శంకర్ ఎద్దేవా చేశారు. "కేసీఆర్ 1000 రోజుల్లో రూ.కోటి 24 లక్షల 40 వేల జీతం తీసుకున్నారనీ, ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి 365 రోజులు ఉద్యోగానికి హాజరు కాకపోతే డిస్మిస్ చేస్తారనీ మరి కేసీఆర్‌ను ఏం చేయాలి. ప్రతిపక్ష నాయకుడి హోదా ఉన్నందుకు ఆయనకు ఇన్ని రోజులు సెక్యూరిటీ, ఇల్లు, బుల్లెట్ ప్రూఫ్ వాహనాలు తదితర వసతుల కోసం ప్రభుత్వం రూ.21 కోట్లు ఖర్చు చేసిందన్నారు. కేసీఆర్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలనీ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ డిమాండ్ చేశారు. ఆయన రాజీనామా కోరుతూ ప్రజలు ఊరూరా ఉద్యమాలు చేయాలనీ కాంగ్రెస్ కార్యకర్తలకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు.

### ప్రజా ప్రభుత్వంపై బురద జల్లే యత్నం

ప్రజాపాలన ఏర్పడి 1000 రోజులు పూర్తయ్యాయని దీంతో ప్రతిపక్ష నేతకు ఈర్ష ద్వేషాలు కుట్రలు మొదలయ్యాయని వీర్లపల్లి శంకర్ వివరించారు. ప్రజా ప్రభుత్వంపై బురద జల్లాలనీ కుట్రలు చేస్తున్నారంటూ బిఆర్ఎస్ పార్టీ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ఆర్థిక పరిస్థితి చూసి ఆశ్చర్యపోయామన్నారు వీర్లపల్లి శంకర్. ధనిక రాష్ట్రంగా తెలంగాణను కేసీఆర్‌కు అప్పగిస్తే.. అప్పులకుప్ప చేశారంటూ విమర్శలు గుప్పించారు. పదేళ్లలో రూ.8 లక్షల కోట్ల అప్పులు చేశారని ఆరోపించారు. కేసీఆర్‌కు ముందు ఉన్న సీఎంలు చేసిన అప్పు రూ.70 వేల కోట్లు కాగా.. కేసీఆర్ ఒక్కరే రూ.7.50 లక్షల కోట్ల అప్పు చేశారన్నారు. ఈ అప్పుల కోసం నెలకు రూ.7,500 కోట్ల అసలు, వడ్డీ కడుతున్నామని వివరించారు. ఏడాదికి రూ.80-90 వేల కోట్ల అప్పు కడుతున్నామని వీర్లపల్లి శంకర్ తెలిపారు.

### మాజీ ఎమ్మెల్యే అంజయ్య ఆయన కుమారులకు ఫాం హౌజ్ ఎక్కడిది..?

కెసిఆర్ బాటలోనే స్థానిక మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆయన కుమారులు విలాసవంతమైన జీవితాలను అనుభవించడం లేదా? ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటుంటే గత 10 సంవత్సరాలు అధికారంలో అమాయకులను దోచుకోలేదా అని స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ విమర్శలు గుప్పించారు. ఆందోళన సందర్భంగా స్థానిక నేతలపై ఆయన ధ్వజమెత్తారు. ఎదుటివారిని విమర్శించేముందు గత ప్రభుత్వ హయాంలో తాము కూడా ఏం చేశారు ఒకసారి తెలుసుకోవాలని అన్నారు. మాజీ ఎమ్మెల్యేకు ఫామ్ హౌస్ లేదా అని ఎమ్మెల్యే శంకర్ ప్రశ్నించారు. అధిష్టానం దృష్టిలో పడేందుకు కొన్ని రాజకీయ విలువలు దిగజార్చుతున్నారని అన్నారు. మరో నాయకుడు సైతం ఆ పార్టీలో ప్రజలను ముంచే రాజకీయంగా ఎదుగుతున్నాడని అలాంటివారు నీతులు చెబుతున్నారని ఆరోపించారు.

గతంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీలు మరిచారా అని ఎమ్మెల్యే శంకర్ ప్రశ్నించారు. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని తెలంగాణకు కాపలా కుక్కలా ఉంటానని చెప్పిన కెసిఆర్ తన కుటుంబంలో అందరికీ పదవులు ఇచ్చారని తెలంగాణ రాష్ట్రం పైకి బిల్లా రంగాలను వదిలారని విమర్శించారు. అందరికీ పదవులు ఇచ్చి రాష్ట్రాన్ని కెసిఆర్ కుటుంబం అడ్డంగా దోచుకోతిన్నదని అన్నారు. అదేవిధంగా మూడెకరాల భూపంపిణీ ఏమైందని ప్రశ్నించారు. గిరిజనులకు మైనార్టీలకు షాద్ నగర్ వేదికగా 12 శాతం రిజర్వేషన్ హామీ ఇచ్చి ఏం చేశారని ప్రశ్నించారు. గతంలో రాజ్యాంగాన్ని అవమానించిన కేసీఆర్‌ను తెలంగాణ నుంచి తరిమికొట్టడానికి బడుగు బలహీనవర్గాల ప్రజానీకం సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ నిర్మించేందుకు కుర్చీ వేసుకొని కూర్చుంటానని ఇచ్చిన హామీ ఏమైంది అన్నారు. 80 వేల పుస్తకాలు చదివిన మేధావి కేసిఆర్ ప్రజా పాలనను ప్రతిపక్ష నేతగా గాడిలో పెట్టడానికి అసెంబ్లీకి ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. బిల్లా రంగాలను రంగలోకి దించి టిఆర్ఎస్ ప్రభుత్వం వస్తుందని డబ్బాలు కొట్టుకు తిరుగుతున్నారని అన్నారు. అధికారంలో ఉంటే మా కుటుంబం లేకపోతే ఇంకా ఎవరూ లేరన్న చందంగా వ్యవహరిస్తున్న కేటీఆర్ హరీష్ రావులను ప్రతిపక్షాన్ని కడిగిపారేస్తామని అన్నారు.

షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్, మార్కెట్ కమిటీ చైర్మన్ సులోచన కృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, మాజీ జెడ్పీటీసీ సభ్యులు తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి, పంది వెంకట్ రాంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ కన్వీనర్ రఘు నాయక్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నాగేందర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజు గౌడ్, కొత్తూరు మాజీ ఎంపీపీ శివ శంకర్ గౌడ్, సింగిల్ విండో చైర్మెన్ లు చల్ల శ్రీకాంత్ రెడ్డి, జితేందర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, అంబటి ప్రభాకర్,

మండల కాంగ్రెస్ అధ్యక్షులు రాయ్ కల్ శ్రీనివాస్, దేపల్లి కుమార స్వామి గౌడ్, ఆ కోగురి పురుషోత్తం రెడ్డి, అన్మగల్ల రమేష్, ఎల్లారం శేఖర్ రెడ్డి,జాకరం చంద్ర శేఖర్,పట్టణ అధ్యక్షు లు నల్ల మోని శ్రీధర్, జాండాగూడెం సుదర్శన్ గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ విశ్వం,కౌన్సిలర్లు రాజు నాయక్, కొప్పునూర్ ప్రవీణ్, మురళి మోహన్ అప్పి, పెంటయ్య, బచ్చలి నరేష్,కాంగ్రెస్ పార్టీ నేతలు చెంది తిరుపతి రెడ్డి, ఇబ్రహీం, జమ్రుత్ ఖాన్,ధంగు శ్రీనివాస్ యాదవ్, కేకే కృష్ణ, కట్ట వెంకటేష్ గౌడ్,శ్రీను నాయక్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కందివనం సూర్య ప్రకాష్, అంబటి ప్రభాకర్, ఖాదర్ ఘోరీ, అంజాధ్ ఘోరీ,చేగురి రాజేందర్ రెడ్డి, చంద్ర పాల్ రెడ్డి,జాంగారి రవి, సోలిపుర్ శ్రీశైలం గౌడ్, గోధ మధవులు యాదవ్, అన్నారం రఘు గౌడ్, తుపాకుల శేఖర్ ముదిరాజ్, కరుణాకర్, లింగారెడ్డి గూడ అశోక్, సీతారాం,జామల్ పూర్ చందూలాల్,ముబరక్, సింగాపగా అనిల్ కుమార్, దాకం మనీష్, రవితేజ చిన్న, జాంగారి జంగయ్య, హైదర్ ఘోరీ, లయక్ బాయి, సత్య నారాయణ రెడ్డి, విఘ్నేష్ రెడ్డి,బాలు నాయక్, పుల్లారెడ్డి, లింగరం యాదయ్య,మల్లేష్ గౌడ్, తంగేడ్ పల్లి శంకర్, శర్ఫొద్దిన్, నిరటి వాసు, కత్తి చంద్రశేఖర్ ,గంగనమోని సత్తయ్య, మహిళ కాంగ్రెస్ నేతలు రజిత, భాగ్య లక్ష్మి యువజన కాంగ్రెస్ నేతలు శ్రీనాథ్,అనిల్, వంశీ, నరేందర్,సర్పంచుల సంఘం నేతలు శివ శంకర్ రెడ్డి, కొమ్ము కృష్ణ,

సర్పంచులు వెల్ జర్ల ఆర్ బాబు నాయక్, ర్యాకల శ్రీనివాస్, రవీందర్ రెడ్డి ,చందు నాయక్, యాదగిరి, తేజ్యా నాయక్, సత్య నారాయణ, నర్సింహులు,రాజు నాయక్ , సురేష్ రెడ్డి చందు నాయక్, రాజు నాయక్, మంకల శ్రీశైలం, శివ రాములు, భాస్కర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ ఆరు మండలాల నాయకులు , యువజన కాంగ్రెస్ నేతలు,అనుబంధ సంఘాల నాయకులు,సర్పంచులు, పట్టణ కౌన్సిలర్ల, కోప్షన్ సభ్యులు,మాజీ ఎంపీటీసీలు,కార్యకర్తలు, కాంగ్రెస్ అభిమానులు పాల్గొన్నారు.

## విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించకపోవడం
# నాటి పోరాట యోధులకు అవమానం



**మధిర సెప్టెంబర్ 03(సికె న్యూస్) ప్రతినిధి.** మధిరలో దక్కన్ సర్దార్ జమలాపురం కేశవరావు ఆశయాలను నేటి తరానికి తెలియజేయాలి: బీజేపీ కిసాన్ మోర్చా మాజీ రాష్ట్ర అధ్యక్షులు కొండపల్లి శ్రీధర్ రెడ్డి

తెలంగాణ విమోచన వారోత్సవాల్లో భాగంగా దక్కన్ సర్దార్‌గా, తెలంగాణ కేసరిగా పేరుగాంచిన మహనీయుడు జమలాపురం కేశవరావు జయంతి సందర్భంగా మధిర పట్టణంలోని మెయిన్ రోడ్డులో ఉన్న ఆయన విగ్రహానికి బీజేపీ కిసాన్ మోర్చా మాజీ రాష్ట్ర అధ్యక్షులు కొండపల్లి శ్రీధర్ రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, జమలాపురం కేశవరావు అభిమానులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కొండపల్లి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం నింపి, స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం జీవితాన్ని త్యాగం చేసిన మహోన్నత పోరాట యోధుడు జమలాపురం కేశవరావు అని కొనియాడారు. ప్రజల కోసం జైలు జీవితాన్ని సైతం లెక్కచేయకుండా పోరాడిన ఆయనను ప్రజలు ప్రేమతో 'దక్కన్ సర్దార్'గా పిలుచుకున్నారని అన్నారు.

నిజాం పాలనలో ప్రజలపై కొనసాగిన నిర్బంధం, నియంతృత్వానికి వ్యతిరేకంగా జమలాపురం కేశవరావు ప్రజలను ఏకం చేసి పోరాటం సాగించారని, హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో చేరే వరకు ఆయన వంటి ఎందరో మహనీయులు చేసిన త్యాగాలు మరువలేనివని శ్రీధర్ రెడ్డి అన్నారు.

అయితే నాటి పోరాట యోధుల త్యాగాలను స్మరించుకోవాల్సిన తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించకుండా చరిత్రను మరుగునపరచే ప్రయత్నం చేస్తోందని ఆయన విమర్శించారు. నిజాం నిరంకుశ పాలన నుంచి తెలంగాణ ప్రజలకు విముక్తి లభించిన చారిత్రక సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

స్వాతంత్ర్యం కోసం, ప్రజాస్వామ్యం కోసం, తెలంగాణ ప్రజల విముక్తి కోసం పోరాడిన యోధుల త్యాగాలను రాజకీయ కోణంలో చూడటం సరికాదని ఆయన అన్నారు. జమలాపురం కేశవరావు వంటి మహనీయుల చరిత్రను భావితరాలకు తెలియజేయడం ప్రభుత్వ బాధ్యత అని, వారి త్యాగాలను గౌరవించడమే నిజమైన నివాళి అని స్పష్టం చేశారు.

బీజేపీ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన వారోత్సవాలను నిర్వహిస్తూ, నాటి పోరాట యోధుల చరిత్రను ప్రజల్లోకి తీసుకెళ్తామని శ్రీధర్ రెడ్డి తెలిపారు. విమోచన చరిత్రను దాచడం ద్వారా చరిత్ర మారదని, మహనీయుల త్యాగాలను తెలంగాణ ప్రజలు ఎన్నటికీ మరచిపోరని అన్నారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి రామిశెట్టి నాగేశ్వరరావు, మధిర అసెంబ్లీ కన్వీనర్ ఏలూరు నాగేశ్వరరావు, జిల్లా నాయకులు చిలివేరు సాంబశివరావు, మధిర పట్టణ అధ్యక్షులు శివరాజు సుమంత్, ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు పాపట్ల రమేష్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, జమలాపురం కేశవరావు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో శ్రీ వీరాంజనేయ స్వామి ప్రథమ వార్షికోత్సవం

- పెద్దేముల్ తండాలో ఘనంగా నిర్వహణ....ప్రత్యేక పూజల్లో పాల్గొన్న తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి



**సికే న్యూస్ పెద్దేముల్ ప్రతినిధి, సెప్టెంబర్ 03:** వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గం పెద్దేముల్ మండల పరిధిలోని పెద్దేముల్ తండాలో కొలువుదీరిన శ్రీ వీరాంజనేయ స్వామి వారి ప్రథమ వార్షికోత్సవ వేడుకలను గురువారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారగా,స్వామివారి దర్శనం కోసం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ఆలయంలో పండుగ వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు జాదవ్ ధారాసింగ్ నాయక్ దంపతులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు.అనంతరం స్వామివారి ఆశీస్సులు పొందారు.తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి సైతం ఆలయానికి విచ్చేసి శ్రీ వీరాంజనేయ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### ప్రజాప్రతినిధులు, నాయకుల హాజరు

శ్రీ వీరాంజనేయ స్వామి వారి వార్షికోత్సవ కార్యక్రమానికి తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజా బాల్‌రెడ్డి,కౌన్సిలర్లు,మండల పార్టీ అధ్యక్షులు, వివిధ గ్రామాల సర్పంచులు,మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు హాజరయ్యారు. ఆలయ నిర్వాహకులు వారికి ఘన స్వాగతం పలికారు.

### పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు

పెద్దేముల్ తండాతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.భక్తులు స్వామివారి ఆశీస్సులు పొందుతూ ఆధ్యాత్మిక భావనలో మునిగిపోయారు.వార్షికోత్సవం సందర్భంగా ఆలయ పరిసరాల్లో భక్తులతో సందడి నెలకొంది.

# న్యూ విజన్ కాన్సెప్ట్ స్కూల్లో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు




ఖమ్మం, సెప్టెంబర్ 3 ( సి కె. న్యూస్ ప్రతినిధి): న్యూ విజన్ కాన్సెప్ట్ స్కూల్ ప్రాంగణంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఎంతో భక్తిశ్రద్ధలతో, కన్నులపండువగా నిర్వహిం చారు. పాఠశాల విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధల వేషధారణలో అలరించి, సాంస్కృతిక కార్యక్రమాలతో అందరినీ ఆకట్టుకున్నారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.డి. ఆబాద్ అలీ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ -- "భగవద్గీతలో శ్రీకృష్ణుడు అందించిన సందేశం, జీవితంలో ధర్మాన్ని పాటించడం మరియు కర్తవ్యాన్ని నిర్వహించడం నేటి విద్యార్థులకు ఎంతో మార్గదర్శకం అన్నారు."చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో వేదికపై ప్రదర్శించిన నృత్యాలు, అలరించాయి. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇలాంటి పండుగ వేడుకలు ఎంతో దోహదపడతాయి" అని ఆనందం వ్యక్తం చేశారు.

విద్యార్థులు కోలాటాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో ప్రాంగణాన్ని కృష్ణమయం చేశారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ సిహెచ్ కార్తీక్, సిహెచ్ స్ఫూర్తి, పాఠశాల ఉపాధ్యాయులు, మరియు విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు.






# చట్టబద్ధతోనే దత్తత ప్రక్రియ

- అక్రమ దత్తతకు వీలులేదు
- రాష్ట్ర హైకోర్టు కీలక తీర్పు

**హైదరాబాద్, సెప్టెంబర్ 3:** రాష్ట్రంలో బాలల సంరక్షణ కేంద్రాలు, సంక్షేమం, పునరావాసానికి సంబంధించిన వ్యవస్థల పనితీరుకు సంబంధించిన వివరాలపై హైకోర్టు బుధవారం ఆరా తీసింది. అక్రమ దత్తతకు సంబంధించిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా చట్టబద్ధ దత్తత ప్రక్రియ తప్పనిసరని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం స్పష్టంచేసింది. 2 మాసాల నుంచి మూడేళ్ల వయసున్న చిన్నారులు అక్రమ దత్తతకు గురైనట్లుగా ఆరోపణలతోపాటు నమోదైన ఎఫ్ఐఆర్‌లలో అసలైన తల్లిదండ్రులను గుర్తించడంలో పోలీసుల వైఫల్యాన్ని న్యాయస్థానం ప్రశ్నించింది. ఈ మేరకు డీఎన్ఏ శాంపిల్స్ సేకరణ వంటి శాస్త్రీయ పద్ధతులను అనుసరించాలంటూ హోంశాఖకు ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలతో వారంలోగా నివేదికను దాఖలు చేయాలని ఆదేశించింది. 2023లో దత్తత తీసుకున్న ఓ చిన్నారిని పోలీసులు స్వాధీనం చేసుకుని స్త్రీ, శిశు సంక్షేమ శాఖకు అప్పగించడాన్ని సవాల్ చేస్తూ నల్గొండ జిల్లా సూరారం మండలానికి చెందిన ఎం.వెంకన్న దంపతులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై హైకోర్టులో బుధవారం విచారణ జరిగింది. దీనిపై




విచారించిన సింగిల్ జడ్జి రూల్స్‌కు విరుద్ధంగా జరిగిన దత్తతను అనుమతించలేమంటూ పిటిషన్‌ను కొట్టివేయడంతో వెంకన్న అప్పీల్ చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా హోంశాఖ ముఖ్యకార్యదర్శి శిఖా గోయల్‌తో పాటు మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రుతి ఓజా, సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి విజయేందిర బోయిలు వర్చువల్‌గా హాజరై సమాధానాలిచ్చారు. క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించి నివేదిక సమర్పించేందుకు సీనియర్ న్యాయవాది బి.మయూర్‌రెడ్డిని అమికస్ క్యూరీగా హైకోర్టు నియమిస్తూ విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది. ఈ సందర్భంగా హైకోర్టు ధర్మాసనం ప్రశ్నలకు మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రుతి ఓజా సమాధానమిస్తూ అనాథలను గుర్తించి సాయం అందిస్తున్నామని తెలిపారు. అన్ని జిల్లాల్లో సీడబ్ల్యూసీ కమిటీలను 2 నెలల్లో పూర్తిచేస్తామని కోర్టుకు విన్నవించారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 291 బాలల సంక్షేమ గృహాలుండగా, అందులో ప్రైవేటు ఆధ్వర్యంలో 231, ప్రభుత్వ ఆధ్వర్యంలో 60 నడుస్తున్నాయన్నారు. నేరాలకు పాల్పడిన, శిక్ష పడిన బాలల కోసం ప్రత్యేకంగా 35 సంరక్షణ కేంద్రాలున్నాయని శృతి ఓజా కోర్టుకు తెలిపారు. ఆరేళ్లలోపు పిల్లల కోసం ప్రత్యేక దత్తత కేంద్రాలు 17 ఉన్నాయని శృతిఓజా వివరించారు. అనాథలుగా, ఎవరైనా అప్పగించడం ద్వారా దొరికిన చిన్నారులను సీడబ్ల్యూసీ ముందు హాజరుపరచి, ప్రత్యేక దత్తత కేంద్రాల్లో ఉంచుతామన్నారు. నిబంధనల ప్రకారం సామాజిక దర్యాప్తు జరిపించి దత్తతకు అర్హులైనవారి వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేస్తామని ఆమె న్యాయస్థానానికి వివరించారు. పిల్లల సంక్షేమాన్ని శిశు సంక్షేమ శాఖ చూసుకుంటుందని, కేసుల్లో దర్యాప్తును మాత్రమే తాము చేపడతామంటూ హైకోర్టుకు శిఖాగోయల్ తెలిపారు. తమ శాఖలో ఎస్సీ, ఎస్టీ పిల్లల సంక్షేమాన్ని చూస్తామని విజయేందిర బోయి వివరించారు.